WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhi telangana

విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి : 1
సంచిక : 61
బుధవారం
06.11. 2024

మార్పు, మార్పు అనుకుంటూ..

అందరి కొంపలు రోడ్డుకీడ్చారు..

- ఆటో డ్రైవర్లూ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి
- కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల్లోనూ ఆందోళన
- ఆటో డ్రైవర్ల మహా ధర్నాలో కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 5 : మార్పు, మార్పు అనుకుంటూ అందరి కొంపలు పుచ్చుకున్నారు... ఈ కాంగ్రెసోళ్లు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లు కూడా ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చింది. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

మిగతా 3 లో

తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం

నష్టపోతున్న కులాలకు ప్రాతినిధ్యం దక్కుతుంది

- కులగణన అవసరాన్ని పార్టమెంట్‌లోనే ప్రస్తావించా
- కులగణన పేరు చెప్పగానే దేశ విభజన పేరుతో విమర్శలు
- ఆ పేరు చెబితేనే ప్రధాని మోడీ విమర్శలు
- హైదరాబాద్ సదస్సులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

హైదరాబాద్, నవంబర్ 5 : దేశసంపద సమానంగా పంచాలంటే..దేశం మొత్తం కులగణన సర్వే చాలా కీలకం అన్నారు. కులగణన సర్వే ఎందుకు కీలకమో రాహుల్ గాంధీ వివరించారు. దేశంలో కుల వివక్ష కొనసాగుతుందని.. కులం విషయంలో ఓ విజన్‌తో ముందుకు వెళ్లాల్సిన అవ సరం ఉందన్నారు. అన్ని మతాలపై మన విజన్ తో వెళ్లడం తప్పనిసరి అన్నారు. దేశాన్ని విభజించేకు ట్ర చేస్తున్నానని ప్రధాని మోదీ అంటున్నారు.. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడం అవుతుందా అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుల గణన సర్వే ద్వారా కులాల లెక్క తెల్చవచ్చు.. దేశవ్యాప్తంగా కులగణనపై పార్లమెంట్ చర్చపెట్టింది తానేనని రాహుల్ గాంధీ అన్నారు. భారతదేశంలో కులవ్యవస్థ చాల బలంగా ఉందని అన్నారు. ఇది కాదనలేని వా స్తవమని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ అనేది కనిపించదని చెప్పారు.

మిగతా 2 లో

సామాజిక న్యాయం రాహుల్ ఆశయం

రాహుల్ మాట ప్రకారం కులగణన
కులగణన సదస్సులో సిఎం రేవంత్ వ్యాఖ్య

> కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటులో విపక్షనేత రాహుల్ అన్నారు. కులాల వారీగా జనాభా లెక్కిస్తే తరాలుగా నష్టపోతు న్న వారికి తగిన ప్రాతినిధ్యం దొరుకు తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణన గురించి ప్రస్తావిం చగానే దేశాన్ని విభజించేస్తున్నామని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను తిప్పి కొట్టారు. తెలంగాణలో కులగణన దేశానికి ఆదర్శం గా నిలవబ-ోతున్నదని రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలో ని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో కులగణనకు సంబంధించి పౌరహక్కు లు, మేధావులతో నిర్వహించిన సభ లో రాహుల్ పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, మేధావులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై సమాధానం చెప్పండి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

3 లో..

కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో 36 మంది మృతి

- ఏడునెలల్లో 600 మందికిఫుడ్ పాయిజనింగ్
- గురకుల పాఠశాలల్లో కనీస వసతులు మృగ్యం
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

3 లో..

హైదరాబాద్, నవంబర్ 5 : ఇప్పటి వరకు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. 36 మంది విద్యార్థుల మరణాలు అంటే చిన్న విషయం కాదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. దాదాపు 600 మంది విద్యార్థులు ఈ ఏడు నెలల్లో ఫుడ్ ఫాయిజనింగ్ బారిన పడ్డారని.. అంతేకాకుండా పాములు, ఎలుకల కాట్లకు గురవుతున్నారన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల బాలికలను హరీష్‌రావు మంగళవారం పరామర్శించారు. కొమరం భీం జిల్లా వాంకిడి మండల గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో ఫుడ్‌పాయిజన్‌తో 60 మంది బాలికలు అస్వస్థతకు గురవగా.. వారిలో ముగ్గురు విద్యార్థినిల పరిస్థితి విషమంగా ఉండటం తో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

మిగతా 3 లో

ఆహార కల్తీని ఉపేక్షించబోం

- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

02

వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

విజన్ 2025 పేరుతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన

మంత్రిపొంగులేటి కీలక ప్రకటన

02

మహిళపై ముగ్గురు లైంగికదాడి

- బట్టలు ఉతికే పని ఉందని పిలిచి దారుణం
- మధురానగర్ ఠాణా పరిధిలో ఘటన
- నిందితులు యూపీకి చెందిన వారిగా గుర్తింపు
- పరారీలో ముగ్గురు కామాంధులు

2 లో..

ప్రైవేటు ఆస్తులపై

సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు

02



25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడి

2 లో..

ప్రైవేటు ఆస్తులపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్ 5 : ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వ హక్కుల పరిధి ఎంతవరకు అనే అంశంపై సుప్రీంకోర్ట్ చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అన్నీ ప్రైవేటు ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వాలకు హక్కులు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఉమ్మడి ప్రయోజనాల కోసం పంపిణీ చేసేందుకుగానూ అన్ని ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోజాలవని స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్యాంగ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు హక్కులు లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు 9 మంది జడ్జిలతో కూడిన ధర్మాసనం 8:1 మెజారిటీతో ఈ తీర్పు ఇచ్చింది. ఈ కీలక తీర్పుని సీజేఐ డీవై చంద్రచూడ్ ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బీ) ప్రకారం ప్రైవేట్ యాజమాన్యంలోని అన్ని వనరులను రాష్ట్రం స్వాధీనం చేసుకునే హక్కు లేదన్నారు. ఈ మేరకు గతంలో జస్టిస్ కృష్ణయ్యర్ ఇచ్చిన తీర్పును మెజారిటీ తీర్పు తోసిపుచ్చింది. ఆర్టికల్ 39(బీ) ప్రకారం ప్రైవేట్ ఆస్తులను 'సమాజ ముఖ్య వనరులు'గా పరిగణించవచ్చా?, పంపిణీ కోసం ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకోవచ్చా? అనే న్యాయపరమైన ప్రశ్నలపై సీజే చంద్రచూడ్‌తో పాటు మరో ఏడుగురు న్యాయమూర్తులు అనుకూలంగా తీర్పుఇచ్చారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం రాష్ట్రాలు అన్ని ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చంటూ గతంలో వెలువడిన అన్ని తీర్పులను జడ్జిలు తోసిపుచ్చారు.

సీజే చంద్రచూడ్ తీర్పులో ఏముందంటే..

" కేవలం భౌతిక అవసరాలే అర్హతగా.. ఒక వ్యక్తికి చెందిన అన్ని ప్రైవేటు వనరులను కమ్యూనిటీ మెటీరియల్ రిసోర్స్‌గా పరిగణించకూడదని భావిస్తున్నాం. సందేహాస్పద వనరు గురించిన విచారణ రాజ్యాంగంలోని 39బీ నిబంధన కిందకు వస్తుంది. వనరుల స్వభావం, లక్షణాలు, సమాజానికి ఎంతవరకు ఉపయోగకరం, వనరుల కొరత, వనరుల పరిణామాలు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజా విశ్వాస సిద్ధాంతం సమాజానికి సంబంధించిన వనరుల పరిధిలోకి వచ్చే ఆస్తులను గుర్తించడంలో దోహదపడుతుంది" అని సీజే చంద్రచూడ్ పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుల తేదీ ప్రకటన

హైదరాబాద్,నవంబర్ 5 : ఇంటర్ ఎగ్జామ్ ఫీజు తేదీలు షెడ్యూల్ వచ్చింది. ఈ నెల 6వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించాలి. రూ. 100 ఆలస్య రుసుంతో నవంబర్ 27 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు చెల్లించొచ్చు. రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 5 నుంచి 11 వరకు, రూ. 1000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 నుంచి 18 వరకు, రూ. 2 వేల ఆలస్య రుసుంతో డిసెంబర్ 19 నుంచి 27 వరకు చెల్లించే అవకాశం కల్పించారు. ఫస్టియర్ జనరల్ కోర్సులకు రూ. 520, వొకేషనల్ కోర్సులకు రూ. 750, సెకండియర్ జనరల్ ఆర్ట్స్ కోర్సులకు రూ. 520, సైన్స్, వొకేషనల్ కోర్సులకు రూ. 750గా ఫీజు నిర్ధారించారు.

దాశరథిని స్మరించుకున్న కేసీఆర్

హైదరాబాద్,నవంబర్ 5 : నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నినదించిన తెలంగాణ కవి రచయిత దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వారి సేవలను స్మరించుకున్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో దాశరథి అందించిన పోరాట స్ఫూర్తి ఇమిడివుందన్నారు. దాశరథి కృషిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించటానికి పలు కార్యక్రమాలు చేపట్టిందని కేసీఆర్ గుర్తుచేశారు.

జెత్వానీ కేసులో సుప్రీంను ఆశ్రయించిన విద్యాసాగర్

న్యూఢిల్లీ, నవంబర్ 5: ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన అరెస్టును సమర్ధిస్తూ... ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గత నెల 10న ఇచ్చిన తీర్పును సుప్రీంలో విద్యాసాగర్ సవాల్ చేశారు. విద్యాసాగర్ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ట్రయల్ కోర్టులో ఇప్పటికే బెయిల్ అప్లికేషన్ దాఖలు చేసినట్లు సుప్రీంకోర్టుకు విద్యాసాగర్ తరపు న్యాయవాదులు చెప్పారు. బెయిల్ అప్లికేషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని విద్యాసాగర్ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. మూడు వారాల్లో బెయిల్ అప్లికేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని లోయర్ కోర్టుకు ధర్మాసనం మార్గదర్శకాలు ఇచ్చింది. అలాగే ప్రతివాదులకు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

మహిళపై ముగ్గురు లైంగికదాడి

హైదరాబాద్, నవంబర్ 5 : హైదరాబాద్ నగరంలో మరో దారుణం జరిగింది. మరో మహిళ సామూహిక అత్యాచారానికి గుయ్యింది. పనికోసం వచ్చిన ఆ మహిళ మృగాళ్ళను నమ్మి వెళ్లి అత్యాచారానికి గురయ్యింది. పొట్ట కూటి కోసం భవన పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఎప్పటిలాగే సోమవారం కూడా ఆ మహిళ పనికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో అనుకోని ఆపద ఆమెను చుట్టుముట్టింది. ముగ్గురు వ్యక్తుల మాయమాటలు చెప్పి పని ఉందని తమవెంట తీసుకుని వెళ్లారు. తీరా అక్కడికి తీసుకుని వెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటు చేసుకుంది. ఓ కార్మికురాలిపై ముగ్గురు కామాంధులు దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఓ భవనంలో పని చేస్తోంది. ఉదయం పనికి వెళ్లిన మహిళ సాయంత్రం భవనంలో పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది. హైటెక్ సిటీ క్రాస్ రోడ్డు వద్ద బస్సు కోసం మహిళ ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో ఎప్పటి నుంచో ఆమెపై కన్నేసిన ముగ్గురు కామాంధులు ఆటోలో ఆమె వద్దకు వచ్చారు. ఆమెకు మాయ మాటలు చెప్పి వాళ్లతో తీసుకెళ్లారు. ఆపై దారుణానికి పాల్పడ్డారు. తమ ఇంట్లో బట్టలు ఉతికే పని ఉందని మహిళకు చెప్పారు. దీంతో బట్టలు ఉతికితే డబ్బులు వస్తాయని ఆశ పడి వారిని నమ్మి వెళ్లింది. ముగ్గురు వ్యక్తులు ఆటోలో మహిళను మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాము ఉంటున్న రూంకు తీసుకువచ్చారు. ఆపై మహిళపై అతి దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. కామాంధుల అఘాయిత్యంతో మహిళ గట్టిగా కేకలు వేసింది. దీంతో పక్కనే ఉన్న ఓ మహిళ అక్కడకు వచ్చి జరుగుతున్న దారుణాన్ని చూసి అవాక్కయ్యింది. అయితే మహిళ రావడాన్ని చూసిన ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆపై బాధితురాలు తనకు జరిగిన అన్యాయం గురించి సదరు మహిళకు చెప్పి భోరున విలపించింది. దారుణాన్ని చూసిన సదరు మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరారైన ముగ్గురు వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కులగణనపై తెలంగాణే రోల్ మోడల్

మొదటి పేజీ తరువాయి

కులగణన ద్వారా ఏళ్లుగా నష్టపోతున్న వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కుల వ్యవస్థ అన్ని రంగాల్లో ఉందని.. రాజకీయ, న్యాయ వ్యవస్థలోనూ అది బలంగా పాతుకుపోయిందని చెప్పుకొచ్చారు. కుల వ్యవస్థ అనేది కొంత మంది ఆత్మ విశ్వాసం దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల యువత సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణలో జరిగే కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలనేది అధికారులు నిర్ణయించకూడదని, సామాన్యులే నిర్ణయించాలని చెప్పారు. కులవివక్ష, కులవ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందని అంగీకరిద్దాం. నేను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారు. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా? కులగణన ద్వారా దళితులు, ఓబీసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుంది. కులగణన తర్వాత ఎవరి దగ్గర ఎంత ఆర్థిక వనరులున్నాయో తెలుసుకుందాం. కులగణన చేస్తామని పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పాను. రిజర్వేషన్ల పరిమితిని తీసేస్తాం అని రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం నుంచి కులగణన ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలకు సర్కార్ ఒంటిపూట బడులను ప్రకటించింది. దేశవ్యాప్తగా ఇప్పటికీ అన్ని రంగాల్లో కుల వివక్ష ఉందన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి కులగణన అవసరం అన్నారు. ఏ వ్యవస్థలో ఎంత మంది ఓబీసీలు ఉన్నారో తెలియాల్సిఉందన్నారు. కులగణనతో అభివృద్ధి , రాజకీయ స్థితిగతులు మారుతాయని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. తాను దేశవ్యాప్తంగా పర్యటించినప్పుడు దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో కుల వివక్ష ఉందని తాను గుర్తించానని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ కనిపించదన్నారు. కుల వివక్ష కారణంగా ఇతర కులాల వారు అవకాశాలు కోల్పోతున్నారని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే యాభై శాతం రిజర్వేషన్లను ఎత్తి వేస్తామని కులగణన ద్వారా సమానంగా అందరికీ అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో తాను అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థల్లో కుల వివక్ష ఉందన్నారు. రాజకీయ న్యాయవ్యవస్థల్లో ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఎస్‌సీ, ఎస్‌టీ, గిరిజన కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని ప్రతిభ ఉన్నప్పటికీ వారికి పాలనా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం రావడం లేదన్నారు. అందువల్లే తాము కులగణన చేపట్టామని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడుతున్న కులగణన అంటే అది కేవలం కులాల లెక్కలు కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పనకు పునాది అని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. మేము దేశాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తున్నాం అంటున్నారని...దేశంలో సంపదను ఎవరి వాటా వారికి ఇవ్వడం దేశాన్ని చీల్చడమా అని రాహుల్ ప్రశ్నించారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలు తయారు చేయాలని రాహుల్ సూచించారు. కులగణన చేసినంత మాత్రాన సరిపోదు. వివిధ కులాల మధ్య సంపద పంపిణీ ఎలా ఉందో అధ్యయనం చేయాలి. అదేవిధంగా బ్యూరోక్రసీ, జ్యుడిషియరీ, మీడియాలో ఓబీసీలు, దళితులు, కార్మికుల భాగస్వామ్యం ఎంతుందో కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు. అందుకే కులగణన చేపట్టామన్నారు. కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్సంగా ఉంటుందని ఈ విషయంలో తాను తెలంగాణ నాయకత్వాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. రాహుల్ గాందీ కార్యక్రమానికి ప్రముఖులైన ఆహ్వానితుల్ని మాత్రం సమావేశంలోకి ఆహ్వానించారు. ఈ సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేస్తారు, ఎలా చేస్తారు అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. స్కూలు టైమింగ్స్ పూర్తయ్యాక ఉపాధ్యాయులు రోజుకు 5 నుంచి 7 ఇళ్లల్లో సమగ్ర సర్వే చేయనున్నారు.

సామాజిక న్యాయం రాహుల్ ఆశయం

రాహుల్ మాట ప్రకారం కులగణన ● కులగణన సదస్సులో సిఎం రేవంత్ వ్యాఖ్య

హైదరాబాద్, నవంబర్ 5 : భారత్ జోడో యాత్ర ఎంతో మందిని కదిలించిందని కులగణన సంప్రదింపుల సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేస్తున్నామని అన్నారు. ఇందిరా గాంధీ 'గరీబ్ హఠావో' అనే నినాదంతో చరిత్రలో నిలిచారని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు రాహుల్ సామాజిక న్యాయం పేరుతో ఇచ్చిన పిలుపుతో ముందుకు కదులుతున్నామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కులగణన చారిత్రకం కాబోతోందని, రాహుల్ గాంధీ నేతలకు మాట ఇస్తే అది శాసనమని రేవంత్ చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణనపై ముందుకెళ్తున్నామని, కులగణన చేసి తెలంగాణ దేశంలో ఆదర్శంగా రాష్ట్రంగా నిలవబోతోందని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కుల గణన సర్వే ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు. పౌరసమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్ గాంధీ ఇక్కడకు రావడం గొప్ప విషయమని, ఈ నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలు ఇవ్వాలన్న ఆలోచనతో రాహుల్ గాంధీ ఇక్కడకు వచ్చారని, మాటలు కాదు చేతలతో చూపాలన్నది రాహుల్ గాంధీ ఆలోచన అని ఆయన వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, ఉద్యోగం, సామాజిక న్యాయం ప్రజలకు అందించాలని రాహుల్ గాంధీ అడుగు ముందుకు వేశారని, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చడమే మన కర్తవ్యమన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలో 31,383 మంది మెయిన్స్ కు ఎంపికయ్యారని, ఇందులో ఓసీలు-3076 (9.8శాతం), ఈడబ్ల్యూఎస్- 2774 (8.8శాతం), ఓబీసీలు-17,921(57.11శాతం), ఎస్సీలు-4828 (15.3శాతం), ఎస్టీలు-2783 (8.8శాతం) అని ఆయన తెలిపారు. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన తెలిపారు. మనది రైజింగ్ తెలంగాణ అని ఆయన వ్యాఖ్యానించారు. దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడం మన కర్తవ్యమన్నారు. కులగణన పూర్తి చేసి బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. కులగణనను 2025 జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని ఈ వేదికపై తీర్మానం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు రాగా ఆయనకు సిఎం రేవంత్ తదితరులు ఘనంగా స్వాగతంపలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి తెలంగాణలో ప్రారంభించనున్న కుల గణనపై ప్రజలు, మేధావులు, వివిధ సామాజిక వర్గాల వారి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. బోయిన్ పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ లో ఈ సదస్సు జరిగింది.

25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 5 : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ సెషన్‌లో భాగంగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. సంవిధాన్ సదన్ (పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదికకానుంది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. నవంబర్ 23న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆ తర్వాతే ఈ సెషన్ ప్రారంభంకానుంది. ఈ సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టనుందని తెలుస్తోంది. గత సెషన్‌లోనే కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చింది. అయితే విపక్షాలు దీనిపై తీవ్ర నిరసన వ్యక్తంచేయడంతో కేంద్రం ఒక్క అడుగు వెనక్కివేసి..దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది.

యూపిలో మదర్సాలకు భారీ ఊరట

న్యూఢిల్లీ, నవంబర్ 5 : మదర్సాల విషయంలో మంగళవారం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. మదర్సాల నిర్వహణకు సంబంధించి ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యూకేషన్ యాక్ట్ 2004 రాజ్యాంగ విరుద్ధమంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో వేల సంఖ్యలో ఉన్న మదర్సాలకు భారీ ఊరట లభించింది. యూపీ మదర్సా ఎడ్యుకేషన్ చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు కీలకతీర్పు వెలువరించింది. ఈ చట్టాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం.. గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఉత్తరప్రదేశ్ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు దానిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అది లౌకికవాద భావనకు విరుద్ధమైనదని ఆ సందర్భంగా తెలిపింది. దాంతో ఆ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. ఇది రాజ్యంగ విరుద్ధమంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని తెలిపింది. ఈ తీర్పు 10వేల మదర్సా టీచర్లు, 17 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతోందని అప్పట్లో పేర్కొంది. ప్రస్తుత తీర్పుతో 16వేల మదర్సాల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. అంతేకాదు.. విద్యా సంస్థలు స్థాపించి, నిర్వహించే హక్కులను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవద్దని తేల్చి చెప్పింది. విద్యా హక్కు చట్టం 2004లో కూడా ఇందుకు సంబంధించి కొన్ని మినహాయింపులు ఉన్నాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో ఉత్తరప్రదేశ్‌లోని 16,000 మదర్సాలలో చదువుకుంటున్న 17లక్షల మంది విద్యార్థులకు భారీ ఊరట కలిగినట్లయ్యింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు తీర్పును తప్పుపట్టింది. యూపీ మదర్సా ఎడ్యూకేషన్ యాక్ట్ చెల్లుబాటును సమర్థిస్తున్నట్లు ప్రకటించింది.

ఆహార కల్తీని ఉపేక్షించబోం

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, నవంబర్ 5 : ఆహారాన్ని కల్తీ చేసేందుకు ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని.. కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హెచ్చరించారు. ఇటీవల ఆహారకల్తీపై వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు. నగరంలోని వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. వ్యాపారం చేసుకునే వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. వసతి గృహాల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టకుండా ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెరిగిన హోటళ్ల సంఖ్య, జనాభాకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచనున్నట్టు మంత్రి ప్రకటించారు.ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ శివలీల, జీహెచ్ఎంసీ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు.

వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

హైదరాబాద్, నవంబర్ 5 : మౌలిక వసతుల అభివృద్ధితో పాటు, ఆధునిక టెక్నాలజీని కూడా జోడించి వరంగల్ నగరాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధి కోసం కీలక ప్రకటన చేశారు. విజన్-2025 పేరుతో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా, వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి, నగర అభివృద్ధిపై చాలా కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. వరంగల్‌ను తెలంగాణ రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని మా లక్ష్యం. మన నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం, అని మంత్రి చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం, నగర అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభమవుతాయని, మొదటి ప్రాధాన్యతగా విమానాశ్రయ నిర్మాణానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. ఈ ప్రకటనతో వరంగల్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. వరంగల్ ప్రజలకు మంత్రి కొండా సురేఖ తీపి కబురు అందించారు. వరంగల్ ప్రజల చిరకాలవాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్టు కల సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసే దిశగా సీఎంతో చర్చిస్తానన్నారు మంత్రి సురేఖ. అత్యుత్తమ నగరంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. జిడబ్ల్యుఎంసి మాస్టర్ ఎ÷-లాన్ అమలుకు ప్రత్యేక అధికారి నియమించాలని ఎంఎయుడి ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.

మార్పు, మార్పు అనుకుంటూ..

మొదటి పేజీ తరువాయి

ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకొలే దన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు అనుభవించామని రోజుకు దాదాపు రూ. 2 వేలు సంపాదించే పరిస్థితి ఉండేదని ఆటో డ్రైవర్లు చెప్పారు. ఇప్పుడు రూ. 200 నుంచి రూ. 300 కూడా సంపాదించలేని పరిస్థితి వచ్చిందని ఆటోడ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. గతేడాది రాహుల్ గాంధీ వచ్చి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ల సమస్యలు తీరుస్తానని రంగుల కల చూపించారు. నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మనం మంచి కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నారు. వాటిని ఇవ్వాలని కోరుతున్నాం. కానీ గత 11 నెలల్లో వీళ్లు చెప్పిన దానికి చేసిన దానికి ఎంత తేడా ఉందో?ఏం మార్పు వచ్చిందో ఒక్కసారి ఆలోచించాలని ఆటో అన్నలను కోరుతున్నాని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వం వచ్చాక ప్రారంభ మయ్యాయి.ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకొలేదన్నారు. శాసన సభలో ఆత్మహత్యలు చేసుకున్న వారి పేర్లతో సహా మేము చెప్పాం. వాళ్ల కుటుంబాలను కూడా ఆదుకోలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ మీరు ఆటో డ్రైవర్లకు ఇస్తా అన్న నెలకు వెయ్యితో పాటు రూ. 5 వేలు నెలకు ఇవ్వాలని కోరుతున్నా. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వచ్చే శాసనసభ సమావేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలి. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను ఆటో డ్రైవర్లు కావాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నేరవేర్చాలి. మా ప్రభుత్వం తెచ్చిన ఇన్సూరెన్స్‌ను తీసివేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది సరికాదు. కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇబ్బంది పెట్టేలా చట్టం చేసింది. అది కూడా రద్దు చేయాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ మీకు చాలా హామీలు ఇచ్చి?మీ నోట్లో మట్టి కొట్టింది. రాహుల్ గాంధీ చెప్పిన తియ్యని, కమ్మని మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ఇక్కడకు ఎక్కువ మంది రాకుండా పోలీసులు ప్రయత్నం చేశారు. దయచేసి పోలీసులు అలా చేయవద్దు. ఎందుకంటే మిమ్మల్ని మీతోనే కొట్టించే పరిస్థితి తీసుకువచ్చారు. పోలీసులు డ్యూటీలు చేయండి. కానీ పేద వాళ్ల పట్ల దయతో ఉండండి. సెక్యూరిటీ లేకుండా బయటకు వెళితే రేవంత్ రెడ్డిని తన్నే పరిస్థితి ఉంది. అందుకే ఆయనకు భయం పట్టుకుంది. నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్న కాంగ్రెస్ పార్టీ సభలో కాంగ్రెస్ నాయకుడే మనం బయటకు వెళితే తన్నే పరిస్థితి ఉందని చెప్పాడు. మనం ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని చెప్పాడు. రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, మహిళలు అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మనం కోరుతున్నాం. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. మీ తరఫున శాసనసభలోనూ మేము పోరాటం చేస్తాం. పోరాటం చేసే వాళ్ల సమస్యలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నానని కేటీఆర్ తెలిపారు.

భూముల ధరలు ఊరికే పెరగలేదు..

- సాగునీటి రంగం బలోపేతం చేసిన కెసిఆర్
- భూముల ధరలపెరుగుదలకు అదే కారణం
- రియల్టర్స్ ఫోరమ్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్,నవంబర్ 5 : ఉమ్మడి ఏపీలో రైతులకు మేలు చేయాలని పాలకులు ఆలోచించ లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రత్యేక తెలంగాణలో కెసిఆర్ రైతుల బాగు గురించి ఆలోచించి సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. దీంతో భూముల ధరలు కూడా పెరిగాయని అన్నారు. తన తాతకు 400 ఎకరాల ఆస్తి ఉండేదని.. అయితే అన్ని ఎకరాలు ఉన్నప్పటికీ నీళ్లు లేకపోవడంతో అవి నిరుపయోగంగా, విలువ లేకుండా ఉండేవన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఎన్నికల ముందు మార్పు కోసం అని కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు పెట్టుబడులు రావని భయపెట్టారు. ప్రత్యేక తెలంగాణ వచ్చినప్పుడు 2 రోజులు పవర్ హాలీడే ఉండేది. 2014కు ముందు రాష్ట్రంలో భూముల ధరలు చాలా తక్కువగా ఉండేవి. భారాస అధినేత కేసీఆర్ కృషి వల్లే భూముల ధరలు పెరిగాయి. సాగునీరు లేకపోతే వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. అదే జరిగితే సంపద సృష్టించడం అసాధ్యం. కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్, అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. తెలంగాణలో సంపద పెరిగింది. సాగునీటి సదుపాయాలు మెరుగయ్యాయి. తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలన తర్వాత తెలంగాణలో వచ్చిన మార్పులు, చేసిన అభివృద్ధి ఏంటనేది తెలంగాణ ప్రజలందరికీ తెలుసని కేటీఆర్ అన్నారు.

కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో 36 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న విద్యార్థినిల్లో ఒకరు వెంటిలేటర్‌పై చావుబతుకుల మధ్య కొట్టమిట్టాడుతున్నారని అన్నారు. ధైర్యంగా ఉండాలని విద్యార్థినిల తల్లిదండ్రులకు చెప్పానన్నారు. గత పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో తల్లిదండ్రుల నమ్మకాన్ని పోగొట్టే విధంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో పరిస్థితులు దిగజారిపోయాయని మండిపడ్డారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలన కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కరెంట్ షాక్‌లు కూడా కామన్ అయిపోయాయన్నారు. ఇటీవలనే మెదక్ హవేలీ ఘన్ పూర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో పిల్లలకు కరెంట్ షాక్ తగిలి హాస్పిటల్‌లో చేరాల్సి వచ్చిందన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ దున్నపోతు మీద వాన పడ్డట్లు సర్కార్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, మంత్రులు మహారాష్ట్ర ,ఝార్ఖండ్ ఎన్నికల బిజీగా ఉన్నారని.. రెసిడెన్షియల్ స్కూళ్ల పై పట్టించుకునే తీరిక వారికి లేదన్నారు. రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితిపై అప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. 36 మంది రెసిడెన్షియల్ విద్యార్థుల మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలే అని ఆరోపించారు. ఈ మరణాలపై ప్రభుత్వంలో ఏ స్థాయిలోనూ సమీక్షలు జరగడం లేదన్నారు. కేసీఆర్ హాయాంలో 1023 ప్రభుత్వ గురుకులాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ప్రతి విద్యార్థిపై సంవత్సారానికి లక్షా 20 వేల రూపాయలు కేసీఆర్ వెచ్చించారని తెలిపారు. కేసీఆర్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఎవరెస్టు స్థాయికి పెంచితే.. రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్ స్కూళ్లలో ఎలుకలు విద్యార్థులను కరిచే స్థాయికి తీసుకుపోయారని ఎద్దేవా చేశారు. విద్యార్థులు జబ్బు పడితే కనీస మందులు అందుబాటులో లేవన్నారు. విద్యార్థులు పడుకునేందుకు కనీసం మంచాలు లేవన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లకున్న పేరును పాడు చేయొద్దని హరీష్‌రావు పేర్కొన్నారు.

ఆరు గ్యారెంటీలపై సమాధానం చెప్పండి: బండి

రాజన్న సిరిసిల్ల,నవంబర్ 5 : రాహుల్ గాంధీకి ఆరు గ్యారంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి కులగణన సంప్రదింపుల సమావేశానికి రాహుల్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగిలో మీడియాతో మాట్లాడారు. ఏం సాధించాని మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ యాడ్స్ ఇస్తుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసమే మూసీ పునరుజ్జీవం చేపడుతున్నారని విమర్శించారు. రూ.15 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. శంషాబాద్‌లో ఆంజనేయస్వామి ఆలయంపై దాడి అమానుషమన్నారు. తక్షణమే దుండుగలను అరెస్ట్ చేయాలన్నారు.

ఆమె నాకు కావాలి.. లేదా చస్తా!

- కోరుట్ల పోలీసు స్టేషన్ ఎదుట యువకుడి రాద్ధాంతం
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- ఇరువైపులా పెద్దలను పిలిపించిన తర్వాత ఘటన
- వాస్తవ పరిస్థితిపై పోలీసుల దర్యాప్తు
- కోరుట్లలో కలకలం రేపిన సంఘటన

(జగిత్యాల)

కోరుట్ల పోలీసు స్టేషన్ ఎదుట మంగళవారం ఒక యువకుడు రాద్ధాంతం చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

ఆమెను నాతో పంపించండి

తన భార్య తనతో కాపురం చేయకుండా.. తనతో మాటైనా చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లి పోయింది.. ఆమె నాక్కావాలి.. అంటూ పట్టణం లోని గంగంపేటకు చెందిన షారుఖ్ అనే యువకుడు ఈనెల 3.న పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఈమేరకు పోలీసులు పెద్దమనుషులను పిలిపించి మాట్లాడారు.

నేను అతనితో ఉండను

ఔను.. నిజమే.! నేను షారుఖ్‌తో మూడు నెలల నుంచి కలిసే ఉంటున్నా. (సహజీవనం) కానీ.. ఇప్పుడు నేను అతనితో కలిసి బతుక లేను.. అతను నన్ను సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకోలేదు..నా బతుకేదో నేను సొంతంగానే బతుకుతాను..అతనితో కలిసి ఉండలేను అని పేర్కొంటూ పెద్దమనుషుల ముందు ఒప్పుకుని తన నిర్ణయాన్ని చెప్పేసింది.ఈమేరకు పెద్దమనుషులు కూడా ఒకరి జోలికి ఇంకొకరు వెళ్లొద్దని తీర్మానం చేసి ఒప్పందపత్రాలు కూడా రాయించారు. ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.ఆమె తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది.

ఆమెను పిలిపిస్తారా.? లేక చావమంటారా.?

మీరు ఎన్నైనా చెప్పండి..ఆమెను నాతో సంసారానికి పంపండి.లేదంటే నేను పెట్రోల్ పోసుకుని చనిపోతానంటూ ఆ షారుఖ్ అనే యువకుడు కోరుట్ల పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై నానా రాద్ధాంతం చేశాడు.ఆత్మహత్యాయత్నం చేసిన అతన్ని వారించి మరోసారి కౌన్సిలింగ్ చేసి పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రయత్నం చేస్తామని పోలీసులు అతన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై తాము దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరణ ఇచ్చారు.కాగా..పోలీసు స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌పై పరువు నష్టం కేసు

నాంపల్లి కోర్టుకు హాజరైన దీపాదాస్ మున్షీ

హైదరాబాద్,నవంబర్5 : బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి పరువునష్టం కేసు దాఖలుచేశారు. ఈ కేసు కోసం మంగళవారం ఆమె నాంపల్లి క్రిమినల్ కోర్టుకు హాజరయ్యారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యల విషయంలో ఆమె పరువునష్టం కేసు వేశారు. ఈ పిటిషన్ పై నాంపల్లి కోర్టు విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో దీపాదాస్ మున్షి కోర్టుకు హాజరయ్యారు.ఆమెకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలు కార్యకర్తలు నాంపల్లి కోర్టుకు వచ్చారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై దీపాదాస్ మున్షి పరువునష్టం కేసు వేయగా, ఈ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ చేస్తోంది. అయితే పలుమార్లు కోర్టుకు బీజేపీ నేత ప్రభాకర్ గౌర్హాజరయ్యారు. ప్రభాకర్ చేసిన ఆరోపణలకు ఆధారాలతో కోర్టుకు హాజరవ్వాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేయడంతో నాంపల్లి కోర్టులో బీజేపీ నేత ప్రభాకర్ హాజరయ్యారు. అయితే ఈకేసును డిసెంబర్ 5వ తేదీకి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. తెలంగాణ బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తనపై చేసిన అవినీతి ఆరోపణలపై ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. తాను 'క్విడ్ ప్రో కో'కు పాల్పడ్డానంటూ గతంలో ప్రభాకర్ చేసిన ఆరోపణలపై దీపాదాస్ మున్షీ పరువునష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్‌లో టికెట్ల కోసం పలువురు నేతలు ఆమెకు బెంజ్ కార్లు గిఫ్ట్‌గా ఇచ్చారంటూ ప్రభాకర్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి.

శోక నగరాన్ని సందర్శించండి

రాహుల్ రాక సందర్భంగా హరీష్ రావు పోస్ట్

హైదరాబాద్, నవంబర్ 5 : హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీ ముందుగా అశోక్‌నగర్ వెళ్లాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్‌ను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వెళ్లాలని.. అక్కడి నిరుద్యోగ యువతను కలవాలని.. ఆ యువత పట్ల ప్రభుత్వం ఎలా ప్రవర్తించిందో చూడాలంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ఇటీవల గ్రూప్-1 విద్యార్థుల ఆందోళనలతో హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో తీవ్ర హైటెన్షన్ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. జీవో నెంబర్ 29ను రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులు నిరసనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వారిని అడ్డుకోవడంతో పాటు అరెస్ట్‌లు చేశారు. పలు చోట్ల లాఠీచార్జ్‌లు కూడా జరిగాయి. నిరుద్యోగుల ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్‌ను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అశోక నగరాన్ని సందర్శించండి రాహుల్ గాంధీ.. మీరు ఎన్నికల ముందు అశోక్ నగర్‌లో నిరుద్యోగ యువతను కలిసిన ప్రదేశంలోనే, మీ సో-కాల్డ్ ప్రజా పాలన విద్యార్థులపై కర్కశంగా వ్యవహరించింది. లాఠీ చార్జ్ చేసి వీపులు పగలగొట్టింది. ఈ దారుణాలు మీకు తెలుసా. హైదరాబాద్‌కు వస్తున్న మీరు ఒకసారి అశోక్ నగర్‌ను సందర్శించి ఆ విద్యార్థులతో మాట్లాడి.. వారి ఆవేదనను వినండి, శోక నగర్‌గా మార్చిన మీ ప్రభుత్వ తీరును చూడండి. మీరు వాగ్దానం చేసిన 2 లక్షల ఉద్యోగాల్లో కనీసం 10? ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఇవ్వలేదు. టీఎస్పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు, ప్రక్షాళన సంగతి దేవుడెరుగు, టీఎస్పీఎస్సీని టీజీపీఎస్‌గా పేరు మార్చి చేతులు దులుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు, కానీ అది కేవలం జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మిగిలిపోయింది. పది నెలల కాలంలో నిరుద్యోగ భృతి, 5 లక్షల రూపాయల యువ వికాసం పథకం వంటి హామీల ఊసు కూడా లేదు. నిరుద్యోగుల పట్ల, విద్యార్థుల పట్ల మీరు మీ పార్టీ చూపిన కపట ప్రేమ బట్టబయలైంది. కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశ పాలనను నిరుద్యోగ యువత తప్పకుండా గుర్తుపెట్టుకుంటుందని అంటూ ఎక్స్‌లో హరీష్‌రావు పోస్టు చేశారు.

అర్థం'నిజం'

కుదిపేస్తున్న ధరల దాడి..

ద్రవ్యోల్బణం!

దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించడంలో పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. రూపాయి మారకం విలువ నానాటికి దిగజారుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం 84 రూపాయలు దాటింది. ధరలు స్వారీ చేస్తున్నాయి. ప్రధానంగా బియ్యం, ఉప్పు, పప్పుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా అజమాయిషీ చేయడంలేదు. ధరలను కంట్రోల్ చేయడం తమ పని కాదన్న రీతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ధరలను అదుపు చేసే యంత్రాంగం లేకుండా పోయింది. పాలకులకు ఇది పని కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మరీ ముఖ్యంగా మోడీ పాలనలో గత పదేళ్లుగా అన్నిర కాల వస్తువుల ధరలు, మందుల ధరలు దాడి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. జిఎస్టీ గురించి సమీక్షించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు నిత్యావసర ధరలతో పాటు, నిత్యం వాడే మందుల ధరలు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఇవన్నీ వాటంతట అవే పెరుగుతున్నాయని అనుకోవడానికి లేదు. అయినా నియంత్రించే వ్యవస్థ లేకుండా పోయింది. వ్యాపారులపై అజమాయిషీ లేకపోవడంతో ధరలతో దాడి చేస్తున్నారు. పేదవాడు మరింత పేద వాడుగా, ధనవంతులు మరింత ధనవంతులగా మారుతున్నారు. పేదరిక నిర్మూలన గురించి మాట్లాడుతున్న మోడీ సర్కార్ ఈ పరిస్థితులను సమీక్షించడం లేదు. ఎక్కడ పేదరికం పోయిందో చెప్పడం లేదు. పేదరికం పోతే పేదలకు ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు చేస్తున్నారో చెప్పడం లేదు. వ్యవసాయోత్పత్తులను పెంచి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం ద్వారా దేశంలోని పేదలకు అన్నం పెట్టాలన్న ప్రణాళికలకు అడుగులు పడడం లేదు. సహజంగానే వ్యవసాయిక దేశమైన భారత్‌లో ఉన్న నేలలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. సహజవనరులు కూడా ఉన్నాయి. పరిమితంగా ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం వంటి విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటించట్లేదు. పథకాల పేరుతో పంచడం తప్ప, ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించడం లేదు. నీటి వనరులను సద్వినయోగం చేసే దిశగా సాగడం లేదు.

వ్యవసాయోత్పత్తులు పెరుగుతున్నా వాటిని ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించి..వేదేశీ మారక ద్రవ్యం సంపాదించేలా ప్రణాళికలు లేకుండా పోయాయి. వ్యవసాయ అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి కుంటుపడటమే ధరలు నానాటికీ పెరగడానికి కారణంగా చూడాలి. ఇబ్బడిముబ్బడిగా ఉచిత పథకాలు, డబ్బుల పందేరంతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అన్నింటికీ ప్రభుత్వాలపై ఆధారపడేలా చేస్తున్నారు. పేదరికానికి మూలం ప్రభుత్వ విధానాలే అన్నది గుర్తించడం లేదు. ప్రజలను దేశ ఉత్పత్తిలో భాగస్వాములుగా చేయడం అన్నది పక్కన పెట్టేశారు. ప్రజలను చైతన్యవంతులుగా, విజ్ఞానవంతులుగా, ఆలోచనా పరులుగా, అవగాహనాపరులుగా చేస్తే తమకు ముప్పు అన్న ఆలోచనలో రాజకీయ పార్టీల నేతలు, పాలకులు ఉన్నారు. భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రంగాల అభివృద్ధి జరుగుతుందని అనుకుంటున్నా అది ఎంతన్నది .. మన ఆర్థికాభివృద్ధిని లెక్కలేసుకుంటే కొంతేనని తేలుతుంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ నానాటికీ దిగజారి చివరకు ఎటుదారితీస్తుందోఅన్న భయం కలుగుతోంది. దారిద్య్ర సూచికలో భారతదేశం 107వ స్థానానికి పడిపోయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశ స్థితిని దారిద్యం వైపు, దివాళాకోరుతనం వైపు చూడడానికి ఒక అవకాశం కలిగింది. ఈ విధంగా భారతదేశం దిగజారిపోవడానికి కారణం పాలకవర్గం తీసుకుంటున్న తిరోగమన చర్యలే అని చెప్పక తప్పదు. కార్పొరేట్ శక్తులు, బ్యాంకులకు డబ్బులు ఎగవేసిన వాళ్ళు, అవినీతి అధికారులు, దోపిడీని కొనసాగిస్తున్న రాజకీయ నాయకులే అత్యధికం. భారతదేశం ఎందుకు ఆర్థికంగా సంక్షోభంలో వుందని పరిశీలిస్తే పాలకుల తిరోగమన విధానాలు కారణంగా చెప్పుకోవాలి. వ్యవసాయ పశుగుణాభివృద్ధి ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాలను ఎవరు కూడా పట్టించు కోవడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థకు ఊతంగా ఉండే వ్యవసాయ రంగాన్ని,పాడి పరిశ్రమను శాస్త్రీయంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయడం లేదు. రైతులను, రైతు కూలీలను నిరంతరం సంక్షోభంలో ముంచుతున్నారు. దేశంలో వ్యవసాయ భూమి విస్తరించట్లేదు. పేద ప్రజలకు భూములు ఇవ్వడంలేదు. పాలకవర్గాలు వీటన్నింటినీ విస్మరించడం వల్లే ఈ రోజున పేదరికం పెరిగిపోతోంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే వివిధ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తి సాధించడం, ఆహార వస్తువుల ధరలస్థిరీకరణ సాధించడం,పేద ప్రజలకు ఆహార భద్రత కలిగించడం, వ్యవసాయదారులు, వినియోగదారుల ప్రయోజనాల మధ్య సమతూకం సాధించడం వంటివి ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా సంస్కరణలు వృద్ధిరేటును పెంచినప్పటికి నిరుద్యోగ నిర్మూలనకు పెద్దగా తోడ్పడలేదు. ముఖ్యంగా సంఘటిత రంగంలో ఉపాధి తగ్గిపోతున్నది. రెగ్యులర్ ఎంప్లాయిస్ తగ్గుతూ క్యాజువల్ లేబర్ పెరుగుతున్నారు. క్యాజువల్ లేబర్‌ను, ప్రభుత్వ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చకపోవడం వలన వారు అభద్రతలో వున్నారు.సమగ్రాభివృద్ధి చెందాలి అంటే పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే సాధ్యమని గుర్తించి ముందుకు సాగాలి. వ్యవసాయఅభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. విప్లవాత్మక చర్యలకు పూనుకోవాలి. అలాగే పాడి రంగాన్ని, కోళ్ల పరిశ్రమల అభివృద్ధి తదితర రంగాలను ప్రోత్సహించాల్సి ఉంది. దేశంలో ఉత్పత్తి రంగాల్లో మాంద్యం పెరిగింది. పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా పడకేసింది. పెట్టుబడులు లేవు, పరిశ్రమలు లేవు, ఉపాధి కల్పన లేదు. మరోవైపు పెద్దఎత్తున ఉద్యోగాలు పోయాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేసిన పాపాన పోలేదు. విద్యాధికులైన యువతకు సంపాదనా మార్గాలను పూర్తిగా మూసేశారు. మరీ ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల ఆర్థికస్థితిని చావుదెబ్బ తీశారు. వాళ్ల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగితే తప్ప మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోలేం.

✍ ఎడిటర్

మోడీ పదేళ్ల పాలనలో ఆర్థికాభివృద్ధి డొల్ల

- ఏడుశాతం అభివృద్ధి పేరుతో గొప్పలు
- 90శాతం మందికి దక్కని ఆర్థికప్రయోజనాలు
- ప్రభుత్వ గణాంకాలకు అందనంతగా ధరల పెరుగుదల

న్యూఢిల్లీ, నవంబర్ 5 : ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ఏడు శాతం వృద్ధితో ప్రపంచంలోనే అగ్రగామి గా ఉందని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నా ..90 శాతం మంది ప్రజలకు దీని ప్రయోజనాలు అందడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన ధరల పెరుగుదల ప్రభుత్వ గణాంకాలకు అందనంతగా ఉందన్నది మరో వాస్తవం. భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వివిధ ప్రభుత్వ శాఖలు ఇటీవల విడుదల చేసిన వివిధ గణాంకాలు విదితం జేస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, విపరీతమైన విదేశీ రుణాలు, విదేశీ వాణిజ్యలోటు వంటివి మన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని వెల్లడించడమే కాదు.. క్షీణతను సూచిస్తున్నాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి అత్యధికంగా నష్టపోయింది. డాలర్ విలువ రూ.84.07 పైసలు. ఆ మారకపు విలువను కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ తన నిల్వల నుంచి పెద్ద మొత్తంలో డాలర్లను విడుదల చేస్తోంది. ఇది విదేశీ మారక నిల్వలను కూడా తగ్గిస్తుంది. మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్య లోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొనుగోలు శక్తిని కూడా తగ్గిస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై విదేశీ పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించు కుంటున్నారు. విదేశీ మదుపరులు ఈ నెలలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో, భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండడంతో విదేశీ పెట్టుబడిదారులు దూరమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చైనా ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించడం భారత మార్కెట్‌ను కూడా తాకింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా 2008లో భారతీయ స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి. అప్పట్లో అది పెద్ద ప్రభావం చూపింది. రూపాయి విలువ క్షీణతకు అది కూడా కారణమైంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం. 40 నెలల్లో అత్యల్ప వృద్ధి రేటు (-) 6.5 శాతం నమోదైంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం రేటుతో పోలిస్తే సెప్టెంబర్‌లో జిఎస్‌టి ఆదాయం పెద్దగా పెరగలేదు. బొగ్గు, విద్యుత్, ముడి చమురు ప్రాసెసింగ్, మైనింగ్ వంటి ఎనిమిది కీలక రంగాల్లో ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామికోత్పత్తి సూచీ ఆగస్టులో ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో కార్ల విక్రయాలు 19 శాతం తగ్గాయి. సేవల రంగ సూచీ కూడా 10 నెలల కనిష్టానికి చేరింది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ రుణాల పంపిణీ తొమ్మిది శాతం పడిపోయింది. బలమైన మరియు చలనశీలమైన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ఇటువంటి అంశాలు క్షీణిస్తున్నాయి. పేలవమైన ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి, దిగువ తరగతులవారి ఆదాయం తగ్గింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొనుగోలు శక్తి లేకపోవడం. కొనుగోలు శక్తి కోవిడ్ పూర్వ స్థాయికి చేరుకోలేదని చాలా సూచికలు చూపిస్తున్నాయి. కొనుగోలు శక్తిని పెంచుకోవాలంటే దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో ఎక్కువ డబ్బు రావాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇతర సంక్షేమ పథకాల కేటాయింపులు పెంచడం లేదు. దానికి బదులుగా, కార్పొరేట్ లకు పన్ను మినహాయింపులతో సహా భారీ సబ్సిడీలు ఇస్తోంది. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పెరుగుతున్న నిరుద్యోగం, వేతన పెరుగుదల లేకపోవడం ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేసింది. ఏడు శాతం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ స్తబ్దుగా ఉందనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు. .

రాష్ట్రంలో మరోమారు సమగ్ర సర్వే

- నేటి నుంచే వివరాల సేకరణకు రంగం సిద్ధం
- ఆస్తులు అప్పులు మొదలు కుటుంబ వివరాల సేకరణ
- వివరాలన్నీ గోప్యంగా కంప్యూటరీకరణకు చర్యలు

హైదరాబాద్, నవంబర్ 5 : రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మొత్తం 56 ప్రధాన ప్రశ్నలు వేస్తారు. వాటిలో కొన్నింటికి ఉప ప్రశ్నలు వేసి ప్రతి కుటుంబం నుంచి సమగ్రంగా సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం గణకులకు నిర్దేశిరచింది. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతిఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి లేదా ఉద్యోగ వివరాలను సేకరిస్తారు. ఇందులో భాగంగా ఆస్తులెన్ని.. అప్పులెన్ని.. ఆదాయమెంత.. ఇంట్లో ఎంతమంది ఉంటారు.. ఎవరైనా విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా.. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఇలా మొత్తం 75 రకాల ప్రశ్నలతో గణకులు వివరాలను సేకరించేలా ప్రశ్నావళిని రూపొందించారు. ఉన్నత చదువు లేదా ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి లేదా ఇతర అవసరాలకు వెళ్లారా.. అని కుటుంబ యజమానిని గణకులు అడుగుతారు. విదేశాల్లో యూకే, అమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు ఐరోపా దేశాలకు వెళ్లినట్లు చెబితే ఒక్కో దేశానికి ఒక ప్రత్యేక కోడ్ నమోదు చేస్తారు. మరే దేశానికి వెళ్లినా ఇతర దేశం అనే కోడ్ నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ నుంచి ఎందరు వలస వెళ్లారు.. ఏ కారణంతో బయటకు వెళ్లారనే సమగ్ర సమాచారం సేకరించడానికి ఈ ప్రశ్నలు రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రజలు తీసుకున్న రుణాలపై ప్రత్యేకంగా మూడు ప్రశ్నలు అడుగుతారు. గత ఐదేళ్లలో ఏమైనా అప్పులు తీసుకున్నారా.. ఎందుకు తీసుకున్నారు.. ఎక్కడి నుంచి రుణం పొందారు.. అనే ప్రశ్నలను ప్రతి కుటుంబాన్ని అడగాలని నిర్ణయించారు. బ్యాంకులు, స్వయంసహాయక సంఘాల నుంచే కాకుండా వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నారా అనే వివరాలను కూడా చెప్పాలి. కుటుంబ సభ్యులందరి స్థిర, చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. చరాస్తుల వివరాలను వేర్వేరుగా నమోదు చేస్తారు. వీటిలో బైకు, స్కూటర్, సొంత అవసరాలకు వాడే కారు, కిరాయికి తిప్పుతున్న కారు వంటివి ఉన్నాయా? వాషింగ్ మిషన్, ఫ్రిజ్, ఏసీ, టీవీ, స్మార్ట్‌ఫోన్ ఇలా మొత్తం 18 రకాల చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి ఇవన్నీ ఎన్ని ఉన్నాయి.. వాటి విలువ ఎంత అనేది తెలపాలి. మీ ఇల్లు ఎన్ని గజాల్లో.. ఏ ప్రాంతంలో ఉంది? ఇంటిలో ఉన్న మొత్తం గదులెన్ని.. బాత్‌రూం, మరుగుదొడ్డి ఉన్నాయా ఇలాంటి వివరాలన్నీ చెప్పాలి. మీకు ఎంత భూమి, ఎన్ని ఎకరాల్లో ఉంది.. అది పట్టా భూమా? లేదా ప్రభుత్వం ఇచ్చిన ఎసైన్డ్ లేదా పట్టాలేని అటవీ భూమా.. వంటి వివరాలు కూడా సేకరిస్తారు. గత ఐదేళ్లలో ఏమైనా సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందారా? ఆ పథకాల పేర్లు ఏమిటి? వంటి వివరాలు సేకరిస్తారు. కుటుంబంలో ఎవరైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఎన్నికైతే రిజర్వేషన్‌లోనా, ఎన్ని పర్యాయాలు అనేది చెప్పాలి. రాష్ట్రపతి, ప్రధాని తప్ప మిగతా ఏ హోదాలో ప్రజాప్రతినిధిగా పనిచేసినా వివరాలు చెప్పాలి. వార్డు సభ్యుడి నుంచి కేంద్రమంత్రి, గవర్నర్, సీఎం దాకా ఏ పదవి పొందినా సరే నమోదు చేయించాలి. సర్వే సమయంలో గణకులు కుటుంబాల నుంచి స్పష్టమైన సమాచారాన్ని తీసుకోవాలి. ప్రతి ఇంట్లో నివసించే కుటుంబసభ్యుల సంఖ్య తీసుకోవాలి. సర్వే ఫారంలో ఇంటి నంబరు, యజమాని పేరు వంటి వివరాలు నమోదు చేయాలి. సర్వే పూర్తయిన ఇంటిగోడపై స్టిక్కర్ అతికించాలి. సర్వే చేసిన తర్వాత ఫారాల్లో నమోదు చేసిన వివరాలను కంప్యూటర్లో నిక్షిప్తం చేయాలి. ఈ పక్రియ చాలా కీలకం. డేటాఎంట్రీ సమర్థంగా నిర్వహిస్తేనే విశ్లేషణ కచ్చితత్వం సాధిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రణాళికశాఖ జిల్లా, మండలాల్లో అవసరమైన డేటాఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి, వారికి శిక్షణ పూర్తిచేసింది. ప్రతిరోజూ గణకులు తీసుకువచ్చిన వివరాల్ని నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఆపరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను సూపర్‌వైజర్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.సర్వే సమయంలో కుటుంబం నుంచి తీసుకున్న సమాచారం విషయంలో గోప్యత పాటించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు మెరుగు పరిచేందుకు, అన్నివర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపింది. ఈ సర్వేకు ప్రణాళికశాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తోంది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది. జిల్లా, మండల నోడల్ అధికారులు.. ఎన్యూమరేషన్ బ్లాక్(ఈబీ)ల గుర్తింపు, గణకుల నియామకం, ఇళ్ల జాబితా, డేటా ఎంట్రీతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. దాదాపు 80 వేల మంది ఉద్యోగులు సర్వేలో పాల్గొంటారు. వీరిలో విద్యాశాఖ నుంచి 48,229 మంది ఉంటారు. ఉపాధ్యాయులే కాకుండా ఇతర కేటగిరీల ఉద్యోగులను సైతం వీలును బట్టి సర్వేకు వినియోగిస్తారు.సర్వే చేయడానికి ఇళ్లను ఈబీలుగా విభజిస్తారు. ఒక గ్రామంలో కనీసం 175 కుటుంబాలుంటే మొత్తంగా దాన్ని ఒకే ఈబీగా నిర్ణయించి ఒక గణకుడికి అప్పగిస్తారు. అంతకన్నా ఎక్కువ కుటుంబాలుంటే వాటిని చిన్న యూనిట్లుగా.. కనీసం ఒక్కో ఈబీలో 150 ఇళ్లు ఉండేలా విభజించి గణకులను నియమించి సర్వేను సకాలంలో పూర్తిచేస్తారు. ఈ నెలాఖరుకల్లా సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

పుట్టలో పాలుపోసి భక్తి చాటుకున్న మహిళలు

వేములవాడ, నవంబర్ 5 : కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగగా జరుపుకుంటారు. నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలు పోసి పూజలను చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో నాగుల చవితి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారమైనది. కనుక చెట్టును, పుట్టను, రాయిని, నదులను, పశు పక్ష్యాదుల సహా సమస్త ప్రాణికోటిని దైవస్వరూపంగా భావించి పూజిస్తారు. అందులో భాగంగానే నాగుపామును నాగరాజుగా, నాగదేవతగా పూజిస్తారు. నాగుల చవితికి పుట్టకు నూలు చుట్టి పూజ లు చేస్తారు. పట్టణం, పల్లెలు అనే తేడా లేకుండా నాగు పాము పుట్టల వద్ద స్థానిక దేవాలయాల వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వద్ద నాగుల చవితి సందర్భంగా భక్తులు పుట్టలో పాలు పోయటానికి ఉదయం నుండి బారులు తీరారు. పుట్టకు పూజలు చేసి పాలు పోసి తమని చల్లా చూడమంటూ నాగదేవతను వేసుకుంటున్నారు. వేములవాడ, ధర్మపురిలో నాగుల చవితి వేడుకలు మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసం నాగుల చవితి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి తెల్లవారుజాము నుండే పుట్టలో పాలు పోసేందుకు మహిళలు తరలివచ్చారు. నాగదేవత విగ్రహంపై పాలు పోసి, మొక్కలు చెల్లించుకుంటున్నారు. పుట్టపై దీపం వెలిగించి, పూలు, పండ్లు పెట్టి నాగేంద్రుడి కృపాకటాక్షాలు తమపై ఉండాలని పుట్ట మట్టి బొట్టు పెట్టుకొని పూజలు నిర్వహించారు. పలు జిల్లాలోని ప్రజలు తెల్లవారు జామునుండే ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సిద్దేశ్వరాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప, కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు నాగేంద్ర స్వామిని దర్శించుకుని పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపుకు షెడ్యూల్ విడుదల

● వనపర్తి డిఐఇఓ ఎర్ర అంజయ్య

వారధి న్యూస్, వనపర్తి : తెలంగాణలో ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించిందని వనపర్తి డిఐఇఓ అంజయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 6 నుండి 26 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించిందని రూ. 100 అపరాధ రుసుంతో డిసెంబర్ 4 వరకు చెల్లించవచ్చన్నారు. జూనియర్/సీనియర్ ఇంటర్ జనరల్ విద్యార్థులకు రూ.520, సీనియర్/జూనియర్ ఒకేషనల్ విద్యార్థులకు రూ.750 పరీక్షా ఫీజును చెల్లించాలన్నారు.

నేడు కురుమూర్తి స్వామి వారి అలంకార మహోత్సవం

వారధి న్యూస్ మహబూబ్ నగర్ : చిన్న చింతకుంట మండలంలోని శ్రీ కురుమూర్తి స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఎస్బిఐ బ్యాంకు లో ఉన్నటువంటి స్వామివారి అలంకార ఆభరణాలను ప్రత్యేక పూజ కార్యక్రమంలో అనంతరం ఆత్మకూరు పట్టణంలో ఊరేగిస్తూ అక్కడి నుండి దుప్పల్లి మీదుగా అమ్మపురం చేరుకొని శ్రీ రాజా సోం భూపాల్ నివాసంలో ప్రత్యేక పూజలు అనంతరం కురుమూర్తి కొండలలో కొలువైన స్వామివారికి ధరింప చేస్తారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా తాజా మాజీ ఎమ్మెల్యేలు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, పాలకమండలి సభ్యులు తెలియజేశారు.

బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా పసుపుల ప్రశాంత్ ముదిరాజ్

వారధి న్యూస్ షాద్ నగర్ : బీసీ సేన షాద్ నగర్ నియోజక వర్గంలో జరిగిన సమావేశంలో బీసీల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చిన 70 సంవత్సరాల తర్వాత కూడా బీసీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉండటం పాలకులకు సిగ్గుచేటు అని, ఈ పరిస్థితి మారడం అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలని, కమిటీలుగా ఏర్పడి చైతన్యంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా, షాద్ నగర్ నియోజక వర్గ అధ్యక్షుడిగా ముకొండ నరేష్ , ప్రధాన కార్యదర్శిగా నరసింహచారి నియమించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, శ్రీశైలం, కృష్ణ, యాదగిరి, మదన్ మోహన్, నందు, సాయి కుమార్, రమేష్ యాదవ్, శ్రీకాంత్, రామకృష్ణ తదితర బీసీ సేన నాయకులు పాల్గొన్నారు.

తేమతో మద్దతు ధర పొందాలి

● ఎన్‌డిటి కాటన్ ఇండస్ట్రీస్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

వారధి న్యూస్,నాగర్ కర్నూల్ బ్యూరో: పత్తి రైతులు ఎనిమిది శాతం తేమను కలిగి ఉన్న పత్తిని సిసిఐ కెనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధరను పొందాలని సిసిఐ అధికారి రమేష్ కోరారు. మంగళవారం జిల్లాలోని ఉరుకొండ పేట ఎన్ డి టి కాటన్ ఇండస్ట్రీస్ లో కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరను ప్రకటించడం జరిగిందని ప్రతి రైతు తేమ శాతాన్ని కలిగి ఉన్న పత్తిని తరలించి మద్దతు ధరకు విక్రయించాలని కోరారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా రైతులు పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి భగవంతు మిల్లు యజమాని నర్సిని వంశీ సూపర్వైజర్ జాజుల బాలరాజు తో పాటు అధికారులు రైతులు పాల్గొన్నారు.

నవంబర్ 6 నుండి కుటుంబాల జాబితా రూపొందించండి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వారధి న్యూస్, వనపర్తి : జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నవంబర్ 6 నుండి ప్రతి ఎన్యుమరేటర్ తమ బ్లాక్ పరిధిలో కుటుంబాల జాబితా తయారు చేయాలని సూచించారు. సాయంత్రం వరకు ప్రతి ఎన్యుమరేటర్ కు ఉత్తర్వుల కాపీలు అందించాలని, ఇంకా శిక్షణ తీసుకోని ఎన్యుమరేటర్లకు వెంటనే శిక్షణ కల్పించాలని జిల్లా ప్రణాళిక అధికారిని ఆదేశించారు. సర్వే నవంబర్ 9న ప్రారంభం కానున్నందున, నవంబర్ 6 నుండి 8వ తేదీలోగా బ్లాక్ వారీగా కుటుంబాల జాబితా సిద్ధం చేసి, ప్రతి ఇంటిపై సమాచార స్టిక్కర్ అతికించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఎన్యుమరేటర్ కు వారు సర్వే చేయాల్సిన బ్లాక్ పరిధిని చూపించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సెక్రెటరీలు, మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు మరియు జవాన్లు బాధ్యత వహించాలని సూచించారు. సర్వేకు అవసరమైన మెటీరియల్ తక్షణమే అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, సిపిఓ భూపాల్ రెడ్డి, ఏవో భాను ప్రకాష్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, తహసిల్దార్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తప్పిదాలకు తావు ఇవ్వకూడదు

● అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వారధి న్యూస్, వనపర్తి : వరి ధాన్యం కొనుగోలు చేస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు సహించబడవని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు సమయంలో ఎఫ్.ఎ.క్యూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు, టెంట్లను ఏర్పాటు చేయాలని, సన్నాలు మరియు దొడ్డు వడ్ల కోసం వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పీపీసీ వద్ద అన్ని వివరాలతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేసి, బుధవారానికి అన్ని కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. వడ్ల బస్తాలపై ప్రత్యేకమైన మార్కింగ్ ఉండాలనీ, ధాన్యం కొనుగోలు తర్వాత టాబ్ లో ఎంట్రీ చేసి, ట్రక్ షీట్ మరియు ఒపీఎంఎస్ లో నమోదు చేయాలని చెప్పారు. రైతులు నష్టపోకుండా వారికి పూర్తి సాయం అందించాలని, తేమ శాతం 14% మించకుండా సన్నాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదనంగా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఆర్డిఓ పీడీ ఉమాదేవి, పౌర సరఫరాల శాఖ డిఎం ఇర్ఫాన్, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, ఏపీఎంలు, ఐకేపీ కేంద్రాల ఇంచార్జిలు పాల్గొన్నారు.

ఘనంగా పల్లపురెడ్డి మనోహర్ రెడ్డి 79వ జన్మదిన వేడుకలు

వారధి న్యూస్ మహబూబ్ నగర్ : మానవతావాది... న్యాయ నిపుణులు వల్లపు రెడ్డి మనోహర్ రెడ్డి 79 వ జన్మదిన వేడుకలు పాలమూరు పట్టణంలో మంగళవారం నాడు ఘనంగా సాగాయి. శెట్టి కాంప్లెక్స్ లోని మనోహర్ రెడ్డి ఇంటికి ఇవాళ ఉదయం నుంచి పెద్ద ఎత్తున అభిమానులు మరియు శ్రేయోభిలాషులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూల బొకేలు, శాలువాలతో ఘనంగా ఆయనను సత్కరించారు. మనోహర్ రెడ్డికి మిఠాయి తినిపించి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఏనుగొండ రెడ్ క్రాస్ అనాథ ఆశ్రమంలో మనోహర్ రెడ్డి బర్త్ డే కేకును విద్యార్థులు కట్ చేసి తమ సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థిని విద్యార్థులకు పండ్లు నోటి పుస్తకాలు పంపిణీ చేసి స్వయంగా మనోహర్ రెడ్డి వారికి భోజనం వడ్డించి తన ప్రేమను పంచారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వయం ప్రకాశకులుగా వెలగాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని... ఆశ్రమానికి ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా అది ఎంతటిదైనా చేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. విద్యార్థుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం తనకు ఎంతో సంతోషదాయకమని, అందరి అభిమానం ఆప్యాయతలే తనకు గొప్ప సంపద అని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుంచి మనోహర్ రెడ్డి సారు సేవా దృక్పథాన్ని గమనిస్తూ ఉన్నానని అతనిది అరుదైన వ్యక్తిత్వం అని కొనియాడారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్... పుట్టినరోజు సందర్భంగా మనోహర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. గొప్ప ఆదర్శనీయమైన వ్యక్తిత్వం మనోహర్ రెడ్డి సొంతమని... అతని బాటలోనే ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగుతున్నానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. రెడ్ క్రాస్ అధ్యక్షుడు లయన్ నటరాజ్.. రెడ్ క్రాస్ సభ్యుడు బాబుల్ రెడ్డి లతోపాటుగా రెడ్ క్రాస్ సిబ్బంది రవికుమార్ తదితరులు ఉన్నారు.

మెనూ పాటించని వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీవోకి వినతిపత్రం

● ఏఐఎస్ఎఫ్ షాద్ నగర్ ఇన్చార్జి ఆకాష్ నాయక్

వారధి న్యూస్, షాద్ నగర్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో షాద్నగర్ నియోజకవర్గంలోని ఆర్డిఓ పేద విద్యార్థుల హాస్టల్ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఏఐఎస్ఎఫ్ షాద్నగర్ ఇంచార్జ్ ఆకాష్ నాయక్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, అలాగే కొంతమంది వార్డెన్లు స్థానికంగా ఉండాలని ఉన్న నిబంధనను పాటించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ లేకుండా వార్డెన్లకు మద్దతుగా ఉంటున్నారని, కూరగాయలు, వంట సామాగ్రి నాణ్యత లోపిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సరైన భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారని, గిరిజన, బీసీ, ఎస్సీ గర్ల్స్ హాస్టల్లో 150కి పైగా విద్యార్థులు శుభ్రత కోసం అవసరమైన టాయిలెట్ల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రైవేట్ బిల్డింగులు వద్దని, గతంలో చాలాసార్లు ప్రభుత్వ భవనాలు నిర్మించాలని వినతులు అందించినప్పటికీ పరిష్కారం జరగలేదని ఆయన వాపోయారు. ఇటీవల చలికాలం ప్రారంభమవుతుండటంతో విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు వంటి సామాగ్రి తక్షణమే అందించాలని, అలాగే షాద్నగర్ కేంద్రంలోని హాస్టళ్లలో టాయిలెట్ సమస్యలు, తలపులు, కిటికీలు లేమితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అధికారులను తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో షాద్నగర్ అధ్యక్షులు నరేష్ రాథోడ్ మరియు ఇతర సభ్యులు పాల్గొని, విద్యార్థుల సమస్యలపై తక్షణ కార్యచరణకు అధికారులను కోరారు.

మతం పేరుతో సోషల్ మీడియాలో దూషించిన వ్యక్తి అరెస్ట్

● అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్

వారధి న్యూస్, నాగర్ కర్నూలు బ్యూరో : మతం పేరుతో కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వ్యక్తిని అరెస్టు చేసిన అచ్చంపేట పోలీసులు అచ్చంపేట పట్టణానికి చెందిన కుల్కుందాకారి శివాజీ అనే వ్యక్తి అచ్చంపేట పట్టణంలో మటన్ షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 2 సాయంకాలం ఆరు గంటల సమయంలో తన వాట్సప్ గ్రూపు నందు మరో మతాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జరిగిందని అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు. . ఇట్టి విషయంపై అచ్చంపేట పిఎస్ నందు ఫిర్యాదు అందగా ఎస్ ఐ రమేష్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టు నందు హాజరు పరిచారని ఆయన తెలిపారు.

అచ్చంపేట ప్రజలకు విజ్ఞప్తి: డిఎస్పీ

సోషల్ మీడియాను దుర్వినియోగం చేయవద్దని ఎవరైనా సోషల్ మీడియాలో లో అభ్యంతరకరమైన విషయాలను పోస్ట్ చేసినయెడల చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని యన హెచ్చరించారు.

నాగుల పంచమి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు

వారధి న్యూస్.నాగర్ కర్నూలు బ్యూరో : నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం అచ్చంపేట మండల పరిధిలోని పలకపల్లి గ్రామంలో మహిళలు పత్తి శ్రద్ధలతో నాగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయం సమీపంలో పుట్ట వద్ద పాలు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక శివాలయంలో స్వామివారికి అభిషేకాలను చేశారు.

లండన్ పర్యటనలో మంత్రి జూపల్లి పాల్గొన్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో: లండన్ లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు ఉమ్మడి పాలమూరు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్వర్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి జిల్లాకు చెందిన తోటి ఎమ్మెల్యే లతో కలిసి పాల్గొన్న
నాగర్ కర్నూలు డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ధర్నాగ్రహ దీక్షలు

వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా పెండింగ్ డీఏలు, పి ఆర్ సి, ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్లులు, జిపిఎఫ్ బిల్లులు, సరెండర్ లీవ్స్, రిటైర్ అయిన వారికి చేయవలసిన చెల్లింపులు వెంటనే పరిష్కరించాలని నూతన కలెక్టరేట్ ఆవరణంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ ఉపాధ్యాయ వర్గానికి పెండింగ్లో ఉంచిన ఆర్థికపరమైన అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మనమోని శేఖర్ మాట్లాడుతూ ఈ సమస్యలను నవంబర్ 22వ తేదీలోపు పరిష్కరించకుంటే నవంబర్ 23 రోజు హైదరాబాదు నందు ధర్మాగ్రహ దీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు డాక్టర్ సురేఖ, శ్రీనివాసులు, పెంట్యా నాయక్, జిల్లా బాధ్యులు వెంకటేష్, నరేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, , రాజశేఖర్ రావు, జగదీష్, విజయ్ రెడ్డి, హరికృష్ణ, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రఘు, గోవింద్ రెడ్డి, నారాయణరెడ్డి, సతీష్ కుమార్, సూర్యనారాయణ, రాజా వర్ధన్ రెడ్డి, మల్లేష్, నిరంజన్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వ విలువల్లతో కూడిన ఉన్నత వృత్తి వైద్య వృత్తి

● వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునందిని

వారధి న్యూస్, వనపర్తి: వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునందిని మంగళవారం వనపర్తి వైద్య కళాశాలలో కొత్త విద్యా సంవత్సరంలో ప్రవేశించిన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైద్య విద్య ఒక ఉన్నత వృత్తి అని, దీనిలో మానవత్వ విలువలు, క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ అవసరమని విద్యార్థులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నూతన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులతో జరిగిన పరిచయ సమావేశంలో ప్రిన్సిపల్ సునందిని వైద్య వృత్తి ద్వారా సమాజానికి సేవ చేయడం గొప్ప అవకాశం అని చెప్పారు. వనపర్తి వైద్య కళాశాలలో చోటు పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అహ్లాద వాతావరణం గల ఈ విద్యాలయంలో చదివేందుకు రావడం తమ అదృష్టం అని ఆమె అన్నారు. "గాంధీ, ఉస్మానియా వంటి పేరుమోసిన కళాశాలల్లో చేరకపోయినప్పటికీ వనపర్తి వైద్య కళాశాల కూడా నేషనల్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొందిన విశ్వసనీయ విద్యాసంస్థ" అని తెలిపారు. కళాశాల ప్రారంభం నుండి దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు
ఇక్కడ వైద్య విద్యను అభ్యసిస్తున్నారని, అందరికీ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు డాక్టర్ రంగా రావు, ఆనాటమీ విభాగం హెచ్ఓడి, వైస్ ప్రిన్సిపల్ రోహిణి దేవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ ఐపీఎస్

వనపర్తి, వారధి న్యూస్: రాష్ట్రంలో పెరిగిపోతున్న వ్యవస్థీకృత నేరాలపై పోలీసులు మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీ జితేందర్ ఐపీఎస్ పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. మంగళవారం డీజీపీ కార్యాలయం నుండి నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, పెండింగులో ఉన్న కేసుల పరిష్కార ప్రగతి గురించి డీజీపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్,

వనపర్తి జిల్లాలో నేరాలపై కఠిన చర్యలు, నేరస్తులకు కోర్టుల్లో శిక్షలు విధించేందుకు తీసుకుంటున్న ముందస్తు చర్యలను వివరించారు. డీజీపీ మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శక సేవలందించాలన్న దృక్పథంతో పోలీసు శాఖ ముందుకు సాగాలని, ప్రజలు పోలీసులపై నమ్మకం పెంపొందించుకునేలా కృషి చేయాలని సూచించారు. ఆయన ప్రధానంగా సీసీటీవీ నిఘా వ్యవస్థను పెంపొందించడం, కమ్యూనిటీ పోలీసింగ్ లో సీసీ కెమెరాలను ప్రోత్సహించడం ద్వారా నేర నియంత్రణకు సహకరించాలని సూచించారు. నేరం చేసే వారికి శిక్ష విధించేలా చర్యలు తీసుకోవడం, నేరం చేయని వారికి రక్షణగా ఉండే విధంగా సాంకేతిక మార్పులు తీసుకురావడం పోలీసు శాఖ లక్ష్యంగా ఉండాలన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం, పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవసరమైన రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం కొనసాగించాలని డీజీపీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, డిసిఆర్బి ఎస్సై రవి ప్రకాష్, డిసిఆర్బి కానిస్టేబుల్ ఈశ్వర్, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

● డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమంలో యువకులకు జూపల్లి అరుణ్ పిలుపు

వారధి న్యూస్, కొల్లాపూర్ : కొల్లాపూర్ నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా తార యుఏవి వారి సహకారంతో హైదరాబాదులోని ఘట్కేసర్ లో మొదటి విడతగా 12 మంది నియోజకవర్గ యువకులకు 12 రోజుల పాటు నిర్వహించే డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ ప్రారంభించారు. రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జూపల్లి అరుణ్ మాట్లాడుతూ.... మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువత టెక్నికల్ రంగాల వైపు అడుగులు వేసి అవకాశాలను అందిపుచ్చుకోవాలని వ్యవసాయ రంగంలో డ్రోన్ల వాడకం అధికంగా పెరిగిన నేపథ్యంలో యువతకు వాటి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఒక్కొక్కరికి లక్ష రూపాయలకు పైగా వెచ్చించి ఈ శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని దీని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొవాలని వారు యువకులకు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నియోజక వర్గంలోని నిరుద్యోగ యువత అన్ని రంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తామని యువకులకు భరోసా కల్పించారు. అనంతరం శిక్షణకు సంబంధించిన వివరాలను సంస్థ ట్రైనర్స్ తో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తార యుఏవి మేనేజింగ్ ఆపరేషన్స్ , డ్రోన్ ట్రైనర్ విజయ్ , ట్రైనర్ శ్రీనాథ్, ప్రవీణ్ ,రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

700 ఏళ్ల నాటి ఇంద్రేశ్వరాలయాన్ని పునరుద్ధరించాలి

● పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో : నాగర్ కర్నూల్ కు 8 కి.మీ తాండూర్ కు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంద్రకీలే గ్రామ పొలాల్లో ఉన్న కాకతీయ కాలపు ఇంద్రేశ్వర ఆలయం శిథిలావస్థలో ఉందని, కాపాడుకొని భావితరాలకు అందించాలని పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూల్ కు చెందిన ప్రముఖ కవులు ముచ్చర్ల దినకర్, వెదిరేపల్లి కాశన్నలు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన మంగళవారం ఇంద్రకీలే ఆలయాన్ని సందర్శించారు. గర్భాలయం, అర్థమండపం, మహా మండపాలతో ఉన్న ఇంద్రేశ్వరాలయం 700 సంవత్సరాల నాటి కాకతీయ ఆలయ వాస్తు, శిల్పానికి అర్థం పడుతుందని, ఆలయం వెలుపల ద్వార శాఖలు, శివలింగం నాగదేవతలు, మహా మండపం లో రెండు నందులు, చక్కటి మహిషాసురమర్తిని శిల్పాలు నిర్లక్ష్యానికి నిలువుటాద్దాలని, చారిత్రక ప్రాధాన్యత గల ఈ శిల్పాలను భద్రపరిచి, ఆలయాన్ని పునరుద్ధరించాలని శివనాగిరెడ్డి ఇంద్రకీలే గ్రామస్తులకు విన్నపం చేశారు. ఆలయం వెనక గల కోనేరు మరమ్మత్తులు చేసి గత వైభవాన్ని సంతరింజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల దినకర్ , వెదిరేపల్లి కాసన్న, తూము వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు మండల సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశం

వారధి న్యూస్, వనపర్తి : పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో మండల సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశం మండల అధ్యక్షుడు నారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు డి నారాయణ, అసెంబ్లీ సభ్యత్వ కోఆర్డినేటర్ మున్నూరు రవీందర్ హాజరై, పెబ్బేరు మండలంలో సభ్యత్వ నమోదు కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై మాట్లాడారు. ఈ సందర్భంగా, రానున్న పది రోజులలో సభ్యత్వ సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ మండలానికి కేటాయించిన 6000 సభ్యత్వాలను పూర్తి చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదులో మెరుగైన ఫలితాల కోసం అందరూ సమీక్షా దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు భగవంతు యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు దేవేందర్ నాయుడు, ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు వినోద్, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, మరియు ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ పెంపుదలపై చర్చించడమే కాకుండా, మండలంలో సభ్యత్వ కార్యక్రమాన్ని మరింత చురుగ్గా నిర్వహించేందుకు అన్ని అవసరమైన సూచనలు మరియు ప్రణాళికలు రూపొందించుకున్నారు.

కృష్ణానదిలో పడి ఆంధ్ర జాలరి మృతి

● అలివి వలలతో చేపల వేట సాగిస్తున్న దళారులు

వారధి న్యూస్, కొల్లాపూర్ : కోట్ల రూపాయలు గడించాలన్న దురాశతో కొంతమంది దళారుల అవతారమెత్తి ఆంధ్ర జాలర్లతో అలవి వలలతో చేపల వేట సాగిస్తూ మైనర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. ఈ క్రమంలోనే పనిచేయడం ఇష్టం లేక వెట్టి చాకిరి భరించలేక పారిపోయేందుకు యత్నించిన ఆంధ్రజాలర్ మైనర్ యువకుడు నాగరాజు కృష్ణా నదిలో పడి మృతి చెందిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి సమీప గ్రామాలకు చెందిన జాలరు నాగరాజు వయసు మైనర్ ఇతడిని గత కొన్ని రోజుల క్రితమే తెలంగాణ మత్స్యకారులు కృష్ణా నదిలో అలవి వలలతో చేపల వేట చేసేందుకు సోమశిల కు తీసుకొచ్చారు. సోమశిల నుండి కృష్ణానది రహదారిలో అమరగిరి సమీపాన గట్టు ప్రదేశంలో చేపల వేట సాగించే స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. గత కొన్ని రోజుల నుండి పని చేస్తున్న నాగరాజుకు చేస్తున్న పని ఇష్టం లేక సొంత ఊరికి పారిపోయేందుకు కృష్ణానదిలో పుట్టి ద్వారా మంగళవారం తెల్లవారు జామున వారి స్థావరం నుండి సుమన్, నాగరాజు అనే యువకులు సోమశిల గ్రామానికి బయలుదేరారు. గ్రామం సమీపం రాగానే నీటిపై తెలియాడుతున్న నీడను చూసి ఒడ్డు వచ్చిందనుకుని ఇద్దరు దూకారు. దీంతో వాళ్లు నీట మునిగారు. చేసేది ఏమీ లేక వారిద్దరు ఈదుతూ గడ్డకు చేరాలని ప్రయత్నించగా అందులో సుమన్ అనే యువకుడు గడ్డకు చేరుకోగా, మైనర్ యువకుడు నాగరాజు ఈదుతూ గడ్డకు చేరుకోలేక నది లోనే ప్రాణాలు విడిచాడు. మంగళవారం ఉదయం సుమన్ చెప్పిన వివరాల ద్వారా మత్స్యకారులు కృష్ణా నదిలో ఒడ్డున ప్రాణాలు కోల్పోయి ఉన్న నాగరాజును గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కొల్లాపూర్ పోస్టుమార్టం గదిలో పెట్టారు. కుటుంబ సభ్యుల ఆచూకీ మేరకు బుధవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ పేర్కొన్నారు.

సరస్వతీ ప్లాంట్ భూములకు రక్షణ

- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- పవర్ ప్రాజెక్ట్ పేరుతో 400 ఎకరాల అటవీభూముల స్వాధీనం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పవన్ కళ్యాణ్ భరోసా

నరసరావుపేట, నవంబర్ 5 : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబానికి చెందిన సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ భూములకు సంబంధించిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. మంగళవారం పల్నాడు జిల్లాలోని మాచవరం మండలం.. వేమవరం, చెన్నాయపాలెం గ్రామాల్లోని సరస్వతి పవర్ ప్లాంట్ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ హయాంలో ఈ సరస్వతి పవర్ ప్రాజెక్ట్ తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో 400 ఎకరాల అటవీ భూములుంటే.. వాటిని రెవెన్యూ భూములుగా మార్చేసి లాక్కున్నారని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా మండిపడ్డారు. 2009లో ఈ భూములను 30 ఏళ్లకు లీజుకు తీసుకుని.. మళ్లీ వాటిని 50 ఏళ్లకు పెంచారని చెప్పారు. తాము పరిశ్రమ ఏర్పాటు చేసి.. అందులో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి.. ఈ భూములు విక్రయించేలా నాటి పెద్దలు నమ్మబలికారన్నారు. ఇష్టం లేకున్నా.. ఈ భూములు అమ్మాల్సిన పరిస్థితి తీసుకు వచ్చారని వివరించారు. అందుకోసం ప్రజలు, రైతులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చారన్నారు. క్రమంలో పెట్రోల్ బాంబులు వేసి వారిని భయపెట్టారని గుర్తు చేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును వేధించి వేధించి చంపేశారన్నారు. ఫర్నిచర్‌పై కోడెలను వేధించిన వ్యక్తి.. ఎలాంట్ పేరుతో భూములు లాక్కున్నారంటూ వైఎస్ జగన్‌పై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఎస్సీ కుటుంబాలకు చెందిన 24 ఎకరాల భూమిని భయపెట్టి మరీ తీసుకున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. లా లాక్కున్న భూముల్లో 20 ఎకరాలు వేమవరంలోనే ఉన్నాయని చెప్పారు. అయితే ఎవరైనా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మాత్రం ఊరుకునేది హెచ్చరించారు. అలాగే 24.78 ఎకరాల కుంటలు, చెరువులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. అలా భూములు లాక్కొని సొంత ఆస్తి మాదిరిగా కుటుంబంలో కొట్టుకుంటున్నారని డిప్యూటీ సీఎం వ్యంగ్యంగా పేర్కొన్నారు. సహజ వనరులు ఒకరి సొత్తు కాదు.. ఒకరి సొంతం కాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇక పోలీస్ ఉన్నతాధికారులు సైతం మెత్తబడిపోయారన్నారు. లేకుంటే వారు సైతం భయపడుతున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. స్థానిక యువతను గత ప్రభుత్వంలోని వారు భయపెడితే ఊరుకుంటారా? పెట్రోల్ బాంబులు, నాటు బాంబులు వేసి బెదిరిస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులది కాదా? రౌడీయిజాన్ని అరికట్టాల్సిన బాధ్యత పోలీసులదని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. వైసీపీ నాయకులు ఇంకా తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. శాంతి భద్రతలు అంటే ఎంత బలంగా ఉంటాయో వాళ్లకు చూపించాలని పోలీస్ అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు.

పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- శాంతిభద్రతల పరిరక్షణలో కటువుగా ఉండాల్సిందే
- హోమంత్రి అనిత స్పష్టీకరణ

అనంతపురం, నవంబర్ 5 : వైకాపా హయాంలో జరిగిన అరాచకాలను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. వైకాపా సైకో బ్యాచ్ అసత్యాలను ప్రచారం చేస్తూ.. ప్రజలను భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమంతో పాటు వారికి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏమీ జరగకపోయినా.. ఏదేదో జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను వైకాపా సైకోలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ ఇంటి భద్రత కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు వైకాపా దుష్టపాలన పాపాలే కారణం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. పోలీసులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సాంకేతికంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

సీఎం చంద్రబాబుతో మందకృష్ణ మాదిగ భేటీ

- ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిచేయాలని వినతి
- దళిత హోంమంత్రిని పవన్ అవమానించారని విమర్శ

అమరావతి, నవంబర్ 5 : ఎస్సీ వర్గీకరణ పక్రియను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు 32 అంశాలపై చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. వర్గీకరణ సహా వివిధ అంశాలపై గంటపాటు చర్చించామన్నారు. కూటమి గెలుపులో మా భాగస్వామ్యం ఉందని గుర్తించాలి. తెదేపా, జనసేన, భాజపాతో కలిసి నాలుగో స్తంభంగా మేం పని చేశాం. మాదిగలకు అన్ని చోట్లా భాగస్వామ్యం కల్పించాలనేదే మా లక్ష్యం' అని మందకృష్ణ తెలిపారు. పవన్ కల్యాణ్ దళిత బిడ్డ అయిన హోంమంత్రి వంగలపూడి అనితను అవమానించారని మండిపడ్డారు. ఏదైనా అంశం ఉంటే కేబినెట్‌లో చర్చించుకోవాలన్నారు. వంగలపూడి అనితపై అలా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. అభిప్రాయం ఎలా ఉన్నా పబ్లిక్‌లో మాట్లాడటం సరి కాదన్నారు. హోంశాఖకు సంబందించిన అభ్యంతరాలు ఉంటే.. కేబినెట్‌లో చర్చించుకోవడమే ముఖ్యమన్నారు. ఇలా ప్రజల ముందు పెట్టి దళిత బిడ్డ అయిన వంగలపూడి అనితను అవమానించడం సరి కాదని మందకృష్ణ అన్నారు. ఈ విషయాన్ని తాము మనసులో పెట్టుకుంటామన్నారు. పవన్ కల్యాణ్ మాదిగలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల సమయంలో సామాజిక న్యాయం గురించి పవన్ మాట్లాడారని..అయితే ఆయన పార్టీ తరపున పోటీ చేసేందుకు అవకాశం వచ్చిన మూడు స్థానాల్లో ఒక్క చోట కూడా మాదిగ వర్గానికి చెందిన నేతకు అవకాశం ఇవ్వలేదన్నారు.గోదావరి జిల్లాల్‌ల్లో రెండుచోట్ల పోటీకి అవకాశం వస్తే ఒకే వర్గానికి ఇచ్చారని మరి రాయలసీమలో రైల్వే కోడూరులో అయినా మాదిగ వర్గానికి అవకాశం ఇవ్వాల్సి ఉందని కానీ పవన్ కల్యాణ్ అక్కడ కూడా మాల వర్గానికి చెందిన వారికే ఇచ్చారన్నారు. అక్కడ మాదిగలు గెలిచి మంత్రులు కూడా అయ్యారని గుర్తు చేశారు. జనసేన పాటించే సామాజిక న్యాయం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు.అందర్నీ సమానంగా చూడాలన్నారు. జనసేన తరపున ముగ్గురు మంత్రులు అయ్యారని అందులో రెండు సామాజికవర్గాలకు చెందిన వారే ఉన్నారన్నారు. రెండు పదవులు ఇతరులకు పోయినా ఒక్క పదవిని అయిన బడుగు బలహీనవర్గాలకు ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ అన్ని వర్గాలను ఆదరిస్తేనే గెలిచిందని గుర్తు చేసుకున్నారు. ఒక ఎస్సీ,ఎస్టీ లేదా బీసీకి ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. పవన్ వెనుక కష్టనష్టాల్లో ఉన్న బలహీనవర్గాల వారికి అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. మందకృష్ణ వ్యాఖ్యలు వైరల్ గా మారుతున్నాయి.

నిత్యకృత్యంగా హత్యాచారాలు

- 120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయి
- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం
- మాజీ మంత్రి రోజా విమర్శలు

తిరుపతి, నవంబర్ 5 : రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యాచారాలు నిర్మూలించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేత రోజా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గడిచిన 120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయని రోజా మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం అయ్యాయని, మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి రోజా ఆరోపించారు.మహిళలపై వరుస అఘాయిత్యాలు జరుగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరగకుండా చూడడంలో హోంమంత్రి అనిత సరిగా పనిచేయడం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడం వెనక కారణం ఏంటి?. దళితవర్గానికి చెందిన హోంమంత్రిపై నిందలు వేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారా?. పిఠాపురం నియోజకవర్గంలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినప్పుడు పవన్ ఎక్కడికి వెళ్లారు. చిన్నారిపై అఘాయిత్యం జరిగితే కనీసం బాధిత కుటుంబాన్ని పవన్ పరామర్శించలేదు. ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి లాగా పనిచేయాలని ఆయన చెబుతున్నారు. యోగి లా పనిచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ చెప్పాలి. అధికారం చేతిలో ఉన్న వాళ్లు తప్పులు జరగకుండా చూడాలి. కానీ సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి తమ విధి నిర్వహణలో విఫలం అయ్యారు. ఇప్పుడు తిరుపతి ఘటనలోనూ నిజాన్ని కప్పిపుచ్చేందుకు బాలికను పరీక్షల పేరుతో అనేక ఆస్పత్రులకు తిప్పడం నిజం కాదా?. ప్రభుత్వం నుంచి తిరుపతి ఎస్పీకి ఎంత ఒత్తిడి వస్తుందో ఆయన మాటలు బట్టే అర్థం అవుతోందన్నారు. డీజీపీ నుంచి కిందస్థాయి సిబ్బంది వరకూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన తనయుడు మంత్రి లోకేశ్ బదిలీలు చేసుకున్నారు. నచ్చిన వారికి పోస్టింగులు ఇచ్చుకుని ఇప్పుడు లైంగిక దాడులకు పాల్పడే నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇన్ని అఘాయిత్యాలు జరుగుతుంటే లోకేశ్ విదేశాల్లో తిరుగుతున్నాడు. ఆయనకి ఎవరు నచ్చలేదో వారిపై రెడ్ బుక్ రాజ్యాంగం రుద్దుతారు. గుడ్లవల్లేరులో మాన, ప్రాణాలు పోయేలా విద్యార్థినిల వీడియోలు తీస్తే వారిని బెదిరించి విషయాన్ని కప్పిపుచ్చారు. ఈ ఘటనలో విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలం అయ్యారు. కాలేజీల్లో అమ్మాయిలపై దాడులు జరుగుతుంటే విద్యా శాఖ మంత్రి ఏం చేస్తున్నారని రోజా ప్రశ్నించారు. తిరుపతి వాసవీ నగర్‌లోనూ యువతిపై దాడి జరిగింది. రిషికొండ ఎక్కడికీ పోదు.. అక్కడే ఉంటుంది. ఇక్కడ మహిళలపై జరుగుతున్న దాడుల్ని చూడండి. మీ వల్ల కాకపోతే రాజీనామా చేయండి. ప్రధాని మోదీని వేడుకుంటున్నా. మీరూ కూటమి ప్రభుత్వంలో ఉన్నారు. ఏపీలో జరుగుతున్న దారుణాలను చూసి రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. హిందూపురంలో అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్ జరిగితే స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమా షూటింగ్స్‌లో పాల్గొన్నారు. కనీసం బాధితులను పరామర్శించలేదన్నారు. డమ్మీ హోంమంత్రిని పెడితే మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. వైసీపీ అధినేత జగన్ తిరుపతికి వస్తున్నారన్న సమాచారంతో బాధితులను బెదిరించి వారితో మాట్లాడిస్తున్నారని రోజా మండిపడ్డారు.

నేడు ఏపీ కేబినేట్ భేటీ

పలు కీలక అంశాలపైచర్చ

అమరావతి, నవంబర్ 5 : అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కేటినేట్ కీలక భేటీ బుధవారం జరుగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 బిల్లు ప్రతిపాదనపై మంత్రి వర్గం చర్చించనుంది. భూసేకరణ చట్టంలోని కొన్ని నిబంధనల కారణంగా భూ ఆక్రమణల్లో కేసుల నమోదుకు ఇబ్బందులు వస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వైకాపా ప్రభుత్వ హయాంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయినట్టు కూటమి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి అందుతున్న ఫిర్యాదుల్లో 80 శాతం భూ ఆక్రమణలపైనే ఉన్నాయి. ప్రస్తుత చట్టంతో అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు ఇబ్బందులు ఉన్నాయని.. దీని స్థానంలో కొత్త చట్టం తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే భూసేకరణ చట్టం 1982ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా ల్యాండ్ గ్రాబింగ్ ప్రోహిబిషన్ బిల్లు 2024ను తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై మంత్రివర్గంలో చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించే అంశం కేబినెట్ భేటీలో చర్చకు రానుంది. వైకాపా హయాంలోని నామినేటెడ్ పదవుల కేటాయింపు చట్టం 2019ని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి అనుబంధంగా ఇచ్చిన జీవో 77ను రద్దు చేస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. 2017లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వే నివేదికను నామినేటెడ్ పోస్టుల నియామకానికి ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త క్రీడా విధానం, డ్రోన్, సెమీకండక్టర్, డేటా సెంటర్ పాలసీల రూపకల్పనపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంపు, ఒలింపిక్స్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాన్ని రూ.7 కోట్లకు పెంపు అంశాలపై కేబినెట్‌లో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ ఛార్జీల భారం మోపితే ఊరుకోం

- ఇచ్చిన హామీ మేరకు టారిఫ్ తగ్గించండి
- గత ప్రభుత్వం పాపాలంటూ భారం మోపుతారా
- ప్రభుత్వ తీరుపై పీసీసీ చీఫ్ షర్మిల విమర్శలు

విజయవాడ, నవంబర్ 5 : విద్యుత్ ఛార్జీలపై ప్రజలను మోసం చేస్తూ వారిపై భారం మోపితే ఊరుకునేది లేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు చేశారు. ఎవరి పాపమో అన్నది పక్కనపెట్టి ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల గురించి ప్రస్తావించడం కాదని, ఆ పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాల్సింది పోయి, ఆ పాపపు పరిహారాన్ని ప్రజల నెత్తిన మోపేందుకు కూటమి సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రూ.18 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల వసూళ్ళ విషయంలో మా తప్పేం లేదని, మాకసలు సంబంధమే లేదని, భారం మాది కాదని, ప్రజల మీదే ఆ మొత్తాన్ని మోపుతున్నారని విరుచుకుపడ్డారు. విద్యుత్ ఛార్జీల గురించి కూటమి ప్రభుత్వ తీరును వైఎస్ షర్మిల తప్పు పట్టారు. విద్యుత్ ఛార్జీలపై సర్కార్‌ది సర్దుబాటు కాదు ఇది, ప్రజలకు 'సర్దుపోటు'. కూటమి సర్కారు ప్రజలకు ఇచ్చిన భారీ కరెంటు షాక్. విద్యుత్ ఛార్జీల విషయంలో వైసీపీ చేసింది పాపం అయితే రాష్ట్ర ప్రజలకు కూటమి సర్కార్ పెడుతుంది శాపం. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఏం సంబంధమని అన్నారు. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తే పడే అదనపు భారం ప్రజల నెత్తిన మోపుతారా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో వైసీపీ భారం రూ.35 వేల కోట్లు అయితే 5 నెలల్లో కూటమి భారం రూ.18 వేల కోట్లా అని ప్రశ్నించారు. వైసీపీకి మీకు ఏంటి తేడా అన్నారు. వైసీపీ 9 సార్లు ఛార్జీలు పెంచిందని, కూటమి అధికారంలో కొస్తే ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచమని, అవసరం అయితే 30 శాతం తగ్గించేలా చూస్తాం అని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలపై కట్టుబడి ఉంటే, తప్పు ఎవరు చేసినా ఆ భారాన్ని ప్రజలపై మోపొద్దనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనే రూ.18 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయండని' వైఎస్ షర్మిల ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై పడుతున్న భారంపై నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీని గల్లా పట్టి అడగండి. ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేస్తే ఊరుకోబోం. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ హెచ్చరిస్తోందన్నారు. ప్రజల ముక్కు పిండి ట్రూఅప్ ఛార్జీల రూపంలో, అధిక కరెంటు బిల్లులు వసూల్ చేయడం దారుణం. వసూల్ చేయడాన్ని నిరసిస్తూ రేపటి నుంచి మూడు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తున్నాం అని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.



కులగణనతోనే బీసీలకు సామాజిక న్యాయం

వెనుకబడిన తరగతుల సంక్షేమం విషయంలో కులగణన అనేది కీలకమైన అంశం. వెనుకబడిన తరగతుల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి కులగణన ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు, బీసీ వర్గాల మేలు కోసం కొత్త పథకాల రూపకల్పనకు సైతం కులగణన దోహదపడుతుంది. మన దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు జరగాలన్నా కులాలవారీగా జనాభాను లెక్కించి తీరాల్సిన అవసరం ఉంది. బీసీల నాయకత్వంలో నడిచే ప్రధాన రాజకీయ పార్టీలు చాలా కాలంగా ఈ డిమాండ్ చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓబీసీలకు మేలు జరిగే విధంగా తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకోవడం ఎంతైనా అభినందనీయం. కులగణనతో రాజకీయ ప్రత్యర్థులపై సమరానికి సన్నద్ధమైంది తెలంగాణ సర్కార్. దాదాపు ఏడాది కిందట తెలంగాణ ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన అంశాన్ని ప్రస్తావించారు. కులగణనతోనే సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే కులగణనకు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకుంది. నిజంగా ఇది శుభ పరిణామమే. ఆర్థిక, సామాజిక అసమానతలకు అడ్డుకట్ట వేయడంలో కులగణన ఎంతగానో తోడ్పడుతుంది. దేశంలోనే తొలిసారి కులగణన నిర్వహించి సెహభాష్ అనిపించుకున్నారు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్. సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్ అంటూ గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వ పెద్దలు చేతులెత్తేసిన కులగణన సర్వేను తమ స్వంత రాష్ట్రంలో నితీశ్ కుమార్ విజయవంతగా చేపట్టారు. మొత్తం రెండు దశల్లో కులగణన ప్రక్రియను నితీశ్ కుమార్ పూర్తి చేశారు. బీజేపీ అసాధ్యమనుకున్నదానిని నితీశ్ కుమార్ సుసాధ్యం చేసి చూపించారు. యావత్ భారతదేశానికి బీహార్‌ను ఒక రోల్ మోడల్‌గా ఆయన తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ఒత్తిడి పెరిగింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పలువురు బీసీ సంఘం నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. తెలంగాణలోనూ కులగణన చేపట్టాలని కోరారు. బీసీ సంఘాల నేతల విజ్ఞప్తికి రేవంత్ సానుకూలంగా స్పందించారు. ఇప్పుడు కులగణనపై రేవంత్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. వెనుకబడిన తరగతుల ప్రయోజనాల దృష్టితో చూస్తే, కులగణన అనేది చాలా ముఖ్యమైన అంశం. వెనుకబడిన తరగతుల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి కులగణన ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు, వెనుకబడిన తరగతుల మేలు కోసం కొత్త పథకాల రూపకల్పనకు సైతం కులగణన దోహదపడుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో కూడా బీసీ వర్గాలకు కులగణన సహాయపడుతుంది. వాస్తవానికి దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు జరగాలన్నా కులాలవారీగా జనాభాను లెక్కించి తీరాల్సిన అవసరం ఉంది. బీసీల నాయకత్వంలో నడిచే ప్రధాన రాజకీయ పార్టీలు చాలా కాలంగా ఈ డిమాండ్ చేస్తున్నాయి. కులాలవారీగా లెక్కలు స్పష్టంగా లేనట్లయితే తమ మేలు కోసం తీసుకువచ్చే చట్టాల అమలులో తీవ్ర ఇబ్బందులు ఉంటాయని బీసీ వర్గాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశ జనాభాలో కులపరంగా, ఆర్థికంగా, చదువుపరంగా వెనుకబడిన కులాలు 52 శాతం ఉంటారన్నది ఒక అంచనా. వీరికి కేంద్ర ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ గతంలోనే సిఫార్సు చేసింది. 1931లో చివరిసారిగా జరిగిన కులగణన వివరాలను ఓబీసీల గుర్తింపునకు ప్రాతిపదికగా తీసుకుంది. అప్పటి నుంచి దేశంలో వివిధ వెనుకబడిన తరగతులు ఎంత శాతం ఉన్నాయనే విషయాన్ని కచ్చితంగా లెక్కగట్టాలనే డిమాండ్ బలంపుంజుకొంది. అయినా 2001, 2011 లో జరిగిన జనగణనలో కులాల వారీగా లెక్కలు తీయడానికి కేంద్రం అంగీకరించలేదు. దేశవ్యాప్తంగా కులగణన జరగకపోవడంతో వెనుకబడిన తరగతులు నష్టపోతున్నాయి. కులాలవారీ జనాభా లెక్కలపై స్పష్టత లేకపోవడమే ఇందుకు కారణం. బీసీ జనాభాకు చెందిన లెక్కల వివరాలు లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బీసీ జనాభా లెక్కలు స్పష్టంగా లేకపోవడం వల్లనే సుప్రీంకోర్టు, హైకోర్టులు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడాన్ని కొట్టి వేస్తున్నాయి. జనాభా లెక్కలు సమగ్రంగా లేకపోవడంతో రిజర్వేషన్లను ఏ మేరకు నిర్ణయించాలనే అంశంపై బీసీ కమిషన్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు ప్రయోజనాలు కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాల్సిన అవసరం ఉంది. 1931 తర్వాత ఎస్సీ, ఎస్టీ మినహా కులాలవారీగా జనగణన చేపట్టనే లేదు. ఏదిఏమైనా వెనుకబడిన తరగతుల జనాభాపై ఇప్పటివరకు అంచనాలే తప్ప ఒక స్పష్టత అంటూ లేదు. దీంతో మొత్తం జనాభాలో ఓబీసీల శాతం ఎంత అనేది ఒక అంచనాగానే మిగిలిపోతోంది. ఈ పరిస్థితుల్లో ఓబీసీలకు మేలు జరిగే విధంగా తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకోవడం ఎంతైనా అభినందనీయం.

క్యాన్సర్ ప్రాణాంతకం...

శరీరంలోని ఏదైనా ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడం, ఇతర కణజాలాలకు వ్యాపించడం కారణంగా ఆయా భాగాల్లో గడ్డలు లేదా రాచపుండు ఏర్పడడాన్ని క్యాన్సర్ వ్యాధిగా పిలుస్తారు. అతి ప్రమాదకర, ప్రాణాంతక క్యాన్స్‌ర్‌కు సరైన చికిత్స లేదు. తొలి దశలో గుర్తించడం వల్ల చికిత్సతో నయం చేయవచ్చు. క్యాన్సర్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడమే మన చేతుల్లో ఉందని గమనించాలి. క్యాన్సర్ పట్ల పూర్తి అవగాహన, తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్సా మార్గాలు, తెలి దశలో గుర్తించడం లాంటి పలు అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏట 07 నవంబర్ రోజున "జాతీయ క్యాన్స్‌ర్ అవగాహన దినం (నేషనల్ క్యాన్సర్ అవేర్‌నెస్ డే)"ను 2014 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. క్నాన్సర్ చికిత్సలో వినియోగపడే రేడియేషన్ థెరపీకి అవసరమైన రేడియం, పొలోనియం రేడియోధార్మిక మూలకాల ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత మేడమ్ క్యూరీ జన్మదినం సందర్భంగా 07 నవంబర్ రోజున క్యాన్సర్ అవగాహన దినంగా పాటిస్తున్నాం. వందకు పైగా క్యాన్సర్ రకాలున్నాయి. వీటిలో రొమ్ము, నోటి, గర్భాశయ, ఊపిరితిత్తుల, క్లోమ, ప్రోస్టేట్, ఎముకలు, రక్తం లాంటి అవయవాల క్యాన్సర్లు ప్రధానమైనవి. క్యాన్సర్లలో కార్సినోమా (చర్మ, రొమ్ము, క్లోమ, ఇతర గ్రంథులకు), సర్కోమా (రక్తనాళాల, ఎముకల, కండరాల), మెలనోమా (చర్మ, పిగ్మెంట్), లింఫోమా (లింఫోసైట్స్), ల్యుకేమియా (రక్తం) అనబడే వర్గాలు ఉన్నాయి. క్యాన్సర్లలో క్లోమ లేదా పాంక్రియాటిక్ క్యాన్సర్ అతి ప్రమాదకరమైనదిగా గుర్తించబడిరది. భారత్‌లో ప్రతి రోజు 1,300 మంది క్యాన్సర్ బారినపడి మరణిస్తున్నారు. మన దేశ పురుషు? ఊపిరితిత్తుల క్యాన్సర్, మహిళల్లో గర్భాశయ క్యాన్సర్‌లు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులతో 71 శాతం మరణాలు నమోదు కాగా భారత్‌లో మాత్రం 63 శాతం మరణాలు సంభవిస్తుండగా, ఇందు

లో 9 శాతం మరణాలు క్యాన్సర్ వల్లనే నమోదు అవుతున్నాయి. 1975లో భారత ప్రభుత్వం ప్రారంభించిన "జాతీయ క్యాన్సర్ నియంత్రణ ప్రోగ్రామ్" ద్వారా క్యాన్సర్‌కు వైద్య సదుపాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం, 1984-85 నుంచి నివారణ చర్యలు/తొలి దశలో గుర్తించే ప్రయత్నాలు కొన సాగుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, హంగేరి, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఐర్లాండ్, అమెరికా లాంటి దేశాల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నట్లు తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం గరిష్టంగా 8.17 శాతం క్యాన్సర్ పేగులు భారత్‌లోనే ఉన్నట్లు పేర్కొనబడిరది. భారత్‌లో 2.25 మిలియన్ల క్యాన్సర్ రోగులు ఉండగా, ప్రతి ఏట 1.1 మిలియన్ల కొత్త కేసులు బయట పడుతుండడం ప్రమాదకర హెచ్చరికగా భావించాలి. మన దేశంలో ప్రతి 8 నిమిషాలకు ఒక గర్భాశయ క్యాన్సర్ రోగి మరణిస్తున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. క్యాన్సర్ కేసుల్లో 66 శాతం వరకు ముదిరిన తర్వాతనే బయట పడడంతో ఆ రోగులను కాపాడడం కష్టం అవుతున్నది. భారతీయుల్లో ప్రతి 10 మందిలో ఒక్కరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, చనిపోయిన ప్రతి 15 మందిలో ఒక్కరు క్యాన్యర్ వ్యాధితో మరణిస్తున్నారని తెలుస్తున్నది. పొగాకు ఉత్పత్తుల దురలవాట్లతో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు అధికంగా నమోదు కావడంతో పాటు భారతీయ మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా కనిపిస్తున్నాయి. వీటికి కోడు ఆల్కహాల్, మాదకద్రవ్యాలు, ఆహారలేమి, పోషకాహారలోపం, కాలుష్యం లాంటి కారణాలు కూడా క్యాన్సర్‌కు ఆజ్యం పోస్తున్నాయి. క్యాన్సర్ వ్యాధికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించని కారణంగా తొలి దశలో గుర్తించడం కష్టంగా తోస్తున్నది. క్యాన్సర్ రోగ లక్షణాల్లో విరోచనాలు, దగ్గు, చర్మంపై మచ్చలు, ఉమ్మితే రక్తం పడడం, రక్తహీనత, రొమ్ములో గడ్డలు, మూత్ర సంబంధ మార్పులు, మలంలో రక్తం పడడం, బీజాల్లో గడ్డలు లాంటివి పేర్కొబడినవి. భారతంలో దాదాపు 50 శాతం క్యాన్సర్ కేసుల్లో రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తుల, జీర్ణకోశ, పెద్ద పేగు క్యాన్సర్లు బయట పడుతున్నాయి. క్యాన్సర్ ప్రధాన చికిత్సల్లో ఇమ్యునోథెరపీ, రేడియోషన్ థెరపీ, కీమోథెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ మార్పిడి, శస్త్ర చికిత్స, ప్రిసీషన్ మెజిసిన్ లాంటివి బహుళ ప్రచారంలో ఉన్నాయి. శరీర బరువు నియంత్రణ, పోషకాహారం, శారీరక శ్రమ, టీకాలు, క్రమం తప్పకుండా చెక్‌అప్‌లు, తీవ్రమైన ఎండ పడకుండా చూసుకోవడం, పొగాకు/ఆల్కహాల్ దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు క్యాన్సర్ రోగం బారినపడకుండా అడ్డుకుంటాయి. శరీరంలోని ఏ భాగంలోన్కెనా గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని గమనించాలి. క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండడం, జీవనశ్కెలిని మార్చుకోవడం లాంటి చర్యలతో క్యాన్సర్‌ను తిప్పికొట్టి క్యాన్సర్ లేని ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నాలు చేద్దాం.

ఏస్మార్ట్ ఫోన్ ప్రభావంతో మనిషి జీవితం సర్వనాశనమైంది

మన జీవితంలో కొన్ని నిత్యావసర వస్తువులు ఉన్నాయి. వాటోలో మొదటిది ఫోన్. పసిపిల్లల నుంచి పండు ముసలి వరకు దీని ఉపయోగం (అవసరం)గా భావిస్తున్నారు. పూర్వకాలంలో దీనికి ఇంత టెక్నాలజీ లేదు కేవలం ఫోన్ కోసం మాత్రమే దీనిని ఉపయోగించుకునే వారు. కాలం మారింది ప్రజల అవసరాలు ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. దీని వాడకం విపరీతంగా పెరిగిపోయింది. ఎవరి చేతిలో చూసిన స్మార్ట్ ఫోన్. ఇది అతి సామాన్య మానవుని నుంచి కోటీశ్వరుని వరకు ఇది ప్రాథమిక అవసరంగా మారిపోయింది. దీనిలో ప్రపంచమే ఇమిడిపోయింది. ఇది వచ్చాకే ఆడవాళ్ళు రోడ్లమీద పడ్డారు. అన్నీఅబద్దాలు చెప్పడం నమ్మిన వారిని మోసం చేయడం. నమ్ముకున్న వారిని నయవంచన చేయడం నేర్చుకున్నారు. దీనిలో రకరకాల ఫ్యూచర్స్ ఉన్నాయి. బ్యాకింగ్, మార్కెటింగ్, ఆడియో, వీడియో, నెట్వర్కింగ్, మొబైల్ రీచార్జ్, ఆన్ లైన్ బెట్టింగ్, ఎలక్ట్రిసిటీ బిల్, ఇష్టాగ్రామ్, ఫేస్బుక్, వాట్సాప్, క్రోమ్, జ్యోతిష్యం, యూట్యూబ్, వార్తా విశ్లేషణ మరియు మొదలైన ఎన్నో విషయాలు దీని అరనిమిషంలో తెలుసుకునే ఛాన్స్ ఉంది. కొన్నివేల, లక్షల, కి.మీ దూరంలో జరుగుతున్న విషయం ఇక్కడే ఉండి తెలుసుకునే అవకాశం ఉంది. యూట్యూబర్స్ కానీ ఇష్టాగ్రామ్ లో మహిళలు తమ పరువు తీసుకునే విధంగా బట్టలు వేసుకుని మగవారిని రెచ్చగోట్టే విధంగా ప్రవర్తిస్తున్నారు. కేవలం లైక్‌ల కోసమే. మరికొంతమంది ఫోన్ లోనే పరిచయమై ప్రేమించుకుని పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. వాడు ఎలాంటి వాడో తెలియదు వాడి కుటుంబం ఎలాంటిదో తెలియదు కేవలం కనిపించే రూపమే గొప్పదని నమ్మి కాలు మారుతున్నారు. ఏదిఏమైనా ఎవరు అవునన్నా ఎవరు కాదన్నా ఈ స్మార్ట్ ఫోన్ మనిషి జీవితాన్ని సర్వ నాశనం చేస్తుందనటంలో ఎటువంటి తప్పులేదు. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకుని సమాజంలో కొంతైనా మార్పు నావల్ల జరిగి కొందరైనా మారుతారనే చిన్న ప్రయత్నం చేస్తున్నాను.

మాచర్ల మధుసూధన్ గౌడ్
సింగోటం గ్రా..
కొల్లాపూర్ మం..
నాగర్ కర్నూల్ జిల్లా..
9908677543.

అటు - ఇటుగా!!

కాలాన్ని వెంటేసుకుని
బాటసారినై లోకాన్ని ఏలుతుంటాను
కటిక నేలపై అక్షరాల్ని చల్లి
భావాన్ని ఆరబెడుతుంటాను
బీడు భూమిలో మొక్కను నాటి
ఎండమావుల్తో వేర్లును తడిపి
ప్రాణం నిలుపుతుంటాను

అస్తమించే సమయాన్ని ఆరాధిస్తూ
ఉదయాన్ని వెలేస్తుంటాను
నేనెప్పుడూ ముందే వెళ్తుంటాను
కాలం నన్ను అనుసరిస్తూ
అడుగులు వేస్తుంటుంది
చీకట్లో వెల్తురునై
వెలుగును మింగి చీకటిగా మారి
స్తబ్ధతగా కదులుతంటాను
కారణం లేకుండా చేసేస్తూ
చేసాక కారణం వెతుకుతుంటాను

భ్రమల్ని బొమ్మలుగా చేసి
వాస్తవాల్ని కథలుగా చెప్పి
సమాజాన్ని నిద్రపుచ్చుతుంటాను
నీటి బుడగపై ప్రయాణం చేస్తూనే
నింగికేసి ఆశగా చూస్తుంటాను
టన్నుల కొద్దీ ఆవేదన అరువు తెస్తూనే
సంతోషాన్ని వేలం పాడుతుంటాను
నమ్మకాన్ని దోసిట నిండా నింపుకొని
అందరికీ ధారపోసి
నాకు నేనే జాలిపడుతుంటాను

ఎత్తుపల్లాలను అవలీలగా దాటేస్తూ
నీడలా కదిలి వెళుతుంటాను
అక్కడక్కడా సూక్తుల్ని చల్లుతూ
యక్ష ప్రశ్నల్ని దాటెళ్ళుతుంటాను
ఉన్నది ఉన్నట్టు మాట్లాడేస్తూ
నిష్ఠూరంతో
సన్మానం చేయించుకుంటాను
అటు ఇటుగా కదిలిపోతాను

- సరెద్దుల రాజారెడ్డి
ఫోన్: 9666016636

ఈ అంధకారం ఇంకా ఎన్నాళ్లు?

ఈ దేశంలో ప్రధానంగా దళితుల పరిస్థితి రోజుకు రోజుకు మరింత అధ్వానంగా మారుతుంది. ఇప్పటికీ మెజారిటీ దళితులకు పారిశుధ్య రంగమే దిక్కవుతుంది. ఇది అధికారిక లెక్కల్లో కూడా తేలింది. ఈ దేశంలో పారిశుధ్య రంగంలో ఎక్కువగా సేవ చేసేది దళిత సామాజిక వర్గానికి చెందిన వారే.. క్షేత్ర స్థాయిలో ఉండే ఈ రంగం తప్ప దళితులకు మెరుగైన అవకాశాలు ఆశించినంత దక్కడం లేదు. ఇదిలా ఉంటే దేశంలో వివిధ నేరాలు చేసి జైలు జీవితం శిక్ష అనుభవించే వారిలోనూ జైళ్లలోనూ కుల ఆదారాన్ని బట్టి పనులు కేటాయించడాన్ని చూస్తే దళితుల పరిస్థితి ఈ దేశంలో ఎంత ఘోరమో అర్థం అవుతుంది. సమూలంగా దళితులకు రావాల్సిన అవకాశాలను కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం కావడం బాధాకరం. వర్గీకరణ అమలుతో కూడిన నియామకాలు చేపడితే తప్పా మాదిగ, ఉపకులాల బతుకుల్లో వెలుగులు నిండవు. ప్రస్తుతం దేశంలో ఎస్సీ వర్గీకరణ మీద ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును చూస్తే దళితుల భవిష్యత్తు అర్థమవుతుంది. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని ఉద్యమం వల్ల ఎబీసీడీ వర్గీకరణ కోర్టు సానుకూల తీర్పునిచ్చింది. మరోవైపు ఏ రాష్ట్రంలో ఆ రాష్ట్రాలకే ఎస్సీ వర్గీకరణ చేసుకునే హక్కు ఇచ్చింది. దీంతో దళితుల్లోని మెజారిటీ ప్రజలకు, అటు ఉపకులాలకు ఈ తీర్పు వారి బతుకుల్లో వెలుగులా మారింది. అన్ని రాష్ట్రాల కంటే తమ రాష్ట్రమే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో చెప్పారు. ఇప్పటికే ఉపాధి అవకాశాలు లేక మానసికంగా మాదిగ నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే గతంలో దేశ వ్యాప్తంగా ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను తీసుకువచ్చింది. అది తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణంగా అమలవుతుంది. ఎస్సీ, బీసీల కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి ఈడబ్ల్యుఎస్ కోటా కింద ఉద్యోగాలు పొందారు. ఈడబ్ల్యుఎస్‌ను అంత తొందరగా అమలులోకి తెచ్చిన ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ తీర్పు

వచ్చినా కమిటీల పేరుతో కాలయాపన చేయడం మంచిది కాదు. తెలంగాణ గ్రూపు - 1లో మెయిన్స్ కోసం అనేక మంది అభ్యర్థులు వాయిదా వేయాలని ఆందోళనలు చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వ విధానాలను తప్పు బట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అయితే అన్యాయం జరుగుతుందని లెక్కలతో చెప్పారు. అయినా కోర్టులు సమర్ధించి పరీక్ష నిర్వాహణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పరీక్షలు నడుస్తున్నాయి. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ కోసం కేబినేట్ సబ్ కమిటీని మంత్రులతో కూడిన కమిటీని వేశారు. ఆ తరువాత ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఏక సభ్య కమిషన్ హై కోర్టు మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తార్‌తో వేసింది. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఆ లోపు జరిగే ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబందించిన పరీక్షలను సైతం ఆ కమిటీ రిపోర్ట్ వచ్చే వరకూ వాయిదా వేయాలి. లేదంటే గ్రూపు 2, గ్రూపు 3లోనూ మాదిగ అభ్యర్థులకు తీవ్రమైన నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పుడు ఎస్సీ జాబితాలోని పూర్తి లెక్కలు తీయకుండా.. వర్గీకరణ అమలు చేయకుండా నియామక పరీక్షలు నిర్వహిస్తే మాదిగ నిరుద్యోగ అభ్యర్థులు మరో దశాబ్దం అంధకారంలోకి వెళ్లే అవకాశం ఉంది. గ్రూపు -2, గ్రూపు 3లోన్కెనా ఎస్సీ వర్గీకరణ అమలు చేసేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి న్యాయం చేయాలి. మాదిగల కంటే మాల కమ్యూనిటీ ఒక తరం ముందు ఉందని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అలాగే మాదిగల ఓట్ల వల్లే తాను జడ్పీటీసీ కాగలిగానని, ఆ తరువాత ఎమ్మెల్యేగా ఇలా అనేక సందర్భాలలో మాదిగలు తన వెంట నిలిచారని ఆయన చెప్పారు. మాదిగలకు కొంత అన్యాయం జరుగుతున్న మాట వాస్తవమేనని సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు. అటువంటి స్పష్టత ఉన్నప్పుడు తక్షణం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తెచ్చి అత్యంత వెనుకబడిన మాదిగ, ఉపకులాల సామాజిక వర్గాలకు అండగా నిలవాలి. లేకుంటే మాదిగల బతుకులు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడే పరిస్థితి ఉంది. ఆర్థిక వెనుకబాటు ఉన్న వారికి రిజర్వేషన్ల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా అమలు చేస్తున్నప్పుడు .. తరతరాలుగా నలిగిపోతున్న ఈ వర్గాలకు సుప్రీం ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలతోన్కెనా వీల్కైనంత త్వరగా అమలు చేయాలి. తెలంగాణలో జరగబోయే ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలి. లేకుంటే డీఎస్సీ, గ్రూపు -1లో నష్టపోయినట్లు మరోసారి నష్టపోయే అవకాశం ఉంది. నవంబర్‌లో గ్రూపు 3, డిసెంబరులో గ్రూపు 2 పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఒకవేళ ఈ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు కల్పించకపోతే నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి... తరతరాల మాదిగల ఆవేదనను అర్థం చేసుకోవాలి. వర్గీకరణ అమలుతో కూడిన నియామకాలు చేపడితే తప్పా మాదిగ, ఉపకులాల బతుకుల్లో వెలుగులు నిండవు. ఎవరి జనాభా ప్రతిపాదికన వారికి దక్కాల్సిన వాటా దక్కాల్సిందే. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పాలకుల అధికార దాహానికి...మాదిగల నినాదం బలమై... మా బతుకులు బలిపీఠం మీద వేలాడేలా చేయడం మంచిది కాదు.

ఈ అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందాలంటే..

జీవనశైలిలో మార్పులు, వ్యాయామం లేకపోవడం వల్ల చాలా మంది ఈ రోజుల్లో అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు అందరూ కూడా ఏదో ఒక సమస్యతో బాధపడుతూనే ఉన్నారు. అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉండాలని చాలా మంది ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తారు. మందులు వాడుతుంటారు. అయిన కూడా కొన్ని సమస్యల నుంచి విముక్తి పొందలేరు. ఈ రోజుల్లో చాలా మంది మలబద్ధకం సమస్యతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం కాకుండా బయట దొరికే ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ ఎక్కువగా తింటున్నారు. దీనివల్ల ఈ సమస్య బారిన పడుతున్నారు. ఈ సమస్య నుంచి తప్పించుకోవాలంటే తప్పకుండా ఆహార విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. పోషకాలు ఉండే ఆహారం, ఫైబర్ ఎక్కువగా ఉండే ఫుడ్‌ను తీసుకోవాలి. లేకపోతే ఈ సమస్య తీవ్రం అవుతుంది. ఆరోగ్యమైన ఫుడ్ తీసుకోకపోతే జీర్ణ క్రియ కూడా దెబ్బతింటుంది. దీంతో కడుపు సంబంధిత సమస్యలు అన్ని కూడా వస్తాయి. ఈ సమస్యలన్నింటి నుంచి విముక్తి పొందాలంటే తప్పకుండా గోండ్ కటిరా వాడాల్సిందే. దీన్ని వాడటం వల్ల ఎలాంటి సమస్యలు అయిన కూడా తక్కువ రోజుల్లోనే తగ్గించుకోవచ్చు. మరి ఈ గోండ్ కటిరాను ఎలా వాడితే ఫలితాలు ఉంటాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

గోండ్ కటిరాను గమ్ కటిరా అని కూడా అంటారు. దీనికి రుచి, రంగు ఉండదు. కానీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. దీన్ని ఎక్కువగా వేసవిలో వాడుతుంటారు. ఇందులో ప్రొటీన్, ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె సంబంధిత సమస్యలు రాకుండా కాపాడటంతో పాటు శ్వాసకోశ వ్యాధులను తగ్గిస్తుంది. దీన్ని వేప చెట్లు నుంచి సేకరిస్తారు. ఈ గోండ్ కటిరాతో మలబద్ధకం సమస్య ఈజీగా తగ్గుతుంది. దీన్ని ఒక గ్లాసు నీటిలో చక్కెర వేసుకుని తాగితే వారం రోజుల్లోనే మలబద్ధకం సమస్య తగ్గుతుంది. ఎవరి బాడీ అయితే బాగా వేడిగా ఉంటుందో.. అలాంటి వారు రోజూ ఈ వాటర్‌ను తాగితే కేవలం వారం రోజుల్లోనే మీ సమస్యలన్నింటి నుంచి విముక్తి పొందుతారు. కొందరు దీన్ని లడ్డూలు కూడా తయారు చేసి తింటారు. వీటితో తయారు చేసిన పదార్థాలు తినడం వల్ల ఎముకలు, కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. వేసవిలో కొందరు కాళ్లు, చేతులు మంట, వడదెబ్బతో ఇబ్బంది పడుతుంటారు. దీని నుంచి విముక్తి చెందాలంటే గోండ్ కటిరాను ఉపయోగించాలి. ఇది శరీరానికి వెంటనే శక్తిని ఇస్తుంది. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి బాగా ఉపయోగపడుతుంది. అలాగే ఆకలిని నియంత్రిస్తుంది. దీంతో తొందరగా బరువు తగ్గుతారు.

ఈ ఆహారాలు తింటే..

తప్పక రొమ్ము క్యాన్సర్ బారిన పడినట్లే!

ప్రస్తుతం మారిన జీవనశైలి వల్ల చాలామంది మహిళలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పురుషులతో పోటీగా మహిళలు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, ఇంట్లో పని, ఆఫీస్‌లో పని వల్ల వాళ్ల ఆరోగ్యంపై అంతగా దృష్టి పెట్టడం లేదు. దీంతో వాళ్లు ఒత్తిడికి గురి అయి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈరోజుల్లో మహిళలు ఎక్కువగా రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. అలాగే గుండె సమస్యలు, మధుమేహం వంటి వాటితో కూడా మహిళలు బాధపడుతున్నారు. బిజీగా ఉండటం వల్ల వాళ్ల ఆరోగ్యాన్ని పెద్దగా పట్టించుకోరు. జ్వరం, ఇంకా ఏదైనా వచ్చిన కూడా ఏం కాదులే అని వదిలేస్తారు. ఇలా చిన్న సమస్యలను పెద్దగా చేసుకుని అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయితే డైలీ తీసుకునే కొన్ని ఆహారాల వల్ల మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడతారని నిపుణులు చెబుతున్నారు.ఈ మధ్య కాలంలో ముఖ్యంగా ప్లాస్టిక్‌లో ఉండే ఆహారాలు ఎక్కువ అయ్యాయి. వీటివల్ల మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మనం తినే ప్రతీ వస్తువు కూడా ప్లాస్టిక్‌తోనే వస్తుంది. చిన్న పిల్లలు తినే పదార్థాల నుంచి అన్ని కూడా ప్లాస్టిక్‌తోనే ముడిపడి ఉన్నాయి. ముఖ్యంగా సూపర్ మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు, వాటి ముక్కలను కూడా కట్ చేసి ప్లాస్టిక్ దాంట్లోనే అమ్ముతున్నారు. ఎక్కువ రోజులు ప్లాస్టిక్‌లో నిల్వ ఉండే ఆహార పదార్థాలను తినడం వల్ల అనారోగ్య సమస్యలు తప్పకుండా వస్తాయి. ముఖ్యంగా మహిళలు అయితే క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్లాస్టిక్‌లో ఉండే ఆహార పదార్థాలను పూర్తిగా తినడం మానేయాలి. వీటివల్లే సగం వ్యాధులన్నీ వస్తాయి. ఎందుకంటే ఈ ప్లాస్టిక్‌లోనే ఎన్నో రకాల హానికరమైన రసాయనాలు ఉన్నాయి. ఇవి శరీర ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్లాస్టిక్ ప్యాకెట్‌లో పీఎఫ్ఏ పాలేట్లు ఉంటాయి. ఇవి అంత తొందరగా నశించవు. ఇందులో ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల అందులోని రసాయనాలు ఈజీగా కడుపులోకి వెళ్లిపోతాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రమాదాకర వ్యాధులు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన పదార్థాలు అసలు తినకూడదు. ఈ రోజుల్లో ప్రతీ ఒక్కరూ కూడా అన్నింటికి ప్లాస్టిక్ డబ్బాలు వాడుతున్నారు. ఆఖరికి తినే ప్లేట్లు కూడా ప్లాస్టిక్. పిల్లలు వాడే వాటర్ బాటిల్, స్నాక్స్, లంచ్ ఇలా అన్నింటికి కూడా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. ఇలా చేయడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాక్‌ఫ్రూట్ తిన్న తర్వాత ఈ పదార్థాలు తింటున్నారా!

మార్కెట్లో ఎన్నో రకాల పండ్లు రోజూ మనకి కనిపిస్తూనే ఉంటాయి. కానీ చాలామందికి కొన్ని రకాల పండ్లు గురించి మాత్రమే తెలుసు. పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. రోజూ పండ్లను తినడం వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. అయితే కొన్ని రకాల పండ్లు కేవలం సీజన్‌లో మాత్రమే దొరుకుతాయి. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు అందుతాయి. అయితే అందరికి జాక్‌ఫ్రూట్ గురించి తెలిసిందే. దీనిని పనస పండు అని కూడా అంటారు. ఇది వేసవిలో మాతమే దొరుకుతుంది. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో బాగా ఉపయోగపడతాయి. ఈ పనస కాయను కూరల్లో, బిర్యానీలో కూడా వాడుతుంటారు. మరికొందరు దీంతో ఊరగాయ కూడా పెడుతుంటారు. ఈ పండు అంటే చాలా మందికి ఇష్టం ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. ఈ పండులో ఫైబర్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ బి, పొటాషియం, కార్బోహైడ్రేట్లు, జింక్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. అయితే కొందరికి తెలియక ఈ పండు తిన్న తర్వాత కొన్ని రకాల పదార్థాలను తింటారు. వీటిని తినడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. మరి జాక్‌ఫ్రూట్ తిన్న తర్వాత ఏ పదార్థాలు తినకూడదో ఈ స్టోరీలో తెలుసుకుందాం. పాలు: పనస పండు ఆరోగ్యానికి మంచిదే. కానీ తిన్న తర్వాత పాలు తాగకూడదు. పాలతో చేసిన పదార్థాలు కూడా తినకూడదు. ఎందుకంటే వెంట వెంటనే తినడం వల్ల చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పనస పండు తిన్న తర్వాత పాలు తాగితే గజ్జి, దురద, తామర, సోరియాసిస్ వంటి చర్మ వ్యాధులు రావడంతో పాటు జీర్ణక్రియ ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. తేనె: పనస పండు, తేనె కలయిక ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పనస పండు తిన్న వెంటనే తేనెతో చేసిన ఏ పదార్థాలను కూడా తీసుకోకూడదు. ఎందుకంటే రెండు కలిపి తినడం వల్ల శరీరంలో బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. దీంతో మధ-ుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బెండకాయ: కొందరు పనస పండు తిన్న వెంటనే బెండకాయలను తింటారు. ఇలా తినడం వల్ల చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ముఖంపై తెల్ల మచ్చలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా బెండకాయ ఆరోగ్యానికి మంచిదే. ఇందులోని పోషకాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. దీన్ని ఎక్కువగా వేపుడు లేదా పులుసు పెట్టి తింటారు.

నిమ్మకాయ సీక్రెట్స్ తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు

నిమ్మకాయలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి.. విటమిన్ సి పుష్కలంగా ఉన్న నిమ్మకాయ మన ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది.. మారుతున్న సీజన్లలో దీని వినియోగం మరిం త ఉ పయోగకరంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతు న్నారు. ముఖ్యంగా వానకాలం, చలికాలంలో వైరల్ ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది.. దీని కారణంగా జలుబు, దగ్గు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు దాడి చేయడం ప్రారంభిస్తాయి. అందుకే.. ఈ కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం.. నిమ్మకాయ మన రోజువారీ ఆహారంలో ముఖ్యమైన భాగం.. దీనిని వివిధ రకాలుగా తింటారు. అయితే. మారుతున్న సీజన్లలో దాని వినియో గాన్ని కొద్దిగా పెంచాలి.. ఇది మిమ్మల్ని అనేక వ్యాధుల నుంచి సురక్షితంగా ఉంచుతుంది. అయితే, మారుతున్న కాలంతోపాటు నిమ్మకాయను ఎందుకు తీసుకోవాలి.. దాని ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. రోగనిరోధక శక్తి పెరుగుతుంది: నిమ్మకాయ విటమిన్ సి గొప్ప మూలంగా పరిగణిస్తారు. ఇది మన శరీరం రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మారుతున్న సీజన్‌లో, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో విటమిన్ సి సహాయపడుతుంది. ఈ సీజన్‌లో నిమ్మరసం తీసుకుంటే వ్యాధుల ముప్పు చాలా వరకు తగ్గుతుంది.కంటి చూపు పెరుగుతుంది: విటమిన్ సి తో పాటు, నిమ్మకాయలో విట మిన్ ఎ కూడా ఉన్నాయి. ఇవి మన కళ్ళకు చాలా ముఖ్య మైనవి. ఇవి కళ్లకు అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లను అందించి దృష్టిని మెరుగుపరుస్తాయి. కాబట్టి, మారుతున్న సీజన్‌లో నిమ్మకాయ వినియోగం కళ్లకు కూడా మేలు చేస్తుంది. గుండె ఆరోగ్యానికి కూడా ముఖ్యమైనది: నిమ్మకా య పొటాషియానికి చాలా మంచి మూలం.. ఇది గుండె ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే పొ టాషియం సహాయంతో అధిక రక్తపోటును నియంత్రించవచ్చు.

దలాల్ స్ట్రీట్‌పై బేర్ పంజా

దేశీయ స్టాక్ మార్కెట్లు మరోమారు కుప్పకూలాయి. రెండు రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు ముందస్తు అప్రమత్తతో అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో సోమవారం ఒక్క పూటలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 942 పాయింట్లు పతనమై.. మూడు నెలల కనిష్టానికి పడిపోగా.. ఎన్ఎస్ఇ నిఫ్టీ 1 శాతం క్షీణించి 24,000 పాయింట్ల దిగువకు జారింది. రిలయన్స్ ఇండిస్ట్రీస్, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువ చోటు చేసుకుంది. ఉదయం స్వల్ప నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. క్రమంగా భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ క్రమంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 941.88 పాయింట్లు లేదా 1.18 శాతం క్షీణించి 78,782కు దిగజారింది. ఇది ఆగస్టు 6 నాటి కనిష్ట స్థాయి. కాగా.. ఇంట్రాడేలో ఏకంగా 1,491 పాయింట్లు కోల్పోయి.. 78,232.60 కనిష్ట స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 23,995 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగనున్నాయి. దీంతో మదుపర్లు ముందు జాగ్రత్తగా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లపై ఇదే ప్రభావం చూపించింది. మరోవైపు ఈ నెల 7న ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వెలువడనున్నాయి. భౌగోళికంగా ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య ఘర్షణ వాతావరణం మరింత ముదురుతున్న సంకేతాలతో చమురు ధర 2 శాతం మేర పెరిగి 75 డాలర్లకు చేరడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేస్తోంది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.11 ఆల్‌టైం కనిష్టానికి పడిపోయింది. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశజనకంగా ఉండటంతో వృద్ధిపై అనుమానాలు పెరిగాయి. విదేశీ పోర్టుఫోలియో మదుపరులు భారీగా పెట్టుబడులను తరలించుకుపోవడం దలాల్ స్ట్రీట్‌పై మరింత ఒత్తిడిని పెంచింది. అక్టోబర్‌లో రూ.1,13,858 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. సెన్సెక్స్-30లో కేవలం ఆరు స్టాక్స్ మాత్రమే రాణించాయి.

₹2000 నోట్లపై

కీలక అప్‌డేట్ ఇచ్చిన రిజర్వ్ బ్యాంక్!

రూ.2000 నోట్లు ప్రస్తుతం కనుమరుగైపోయాయి. పెద్దనోట్లను ఉపసంహరించుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత ఏడాది కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ నోట్లకు సంబంధించి మరో విషయాన్ని వెల్లడిరచింది. రూ.2000 నోట్లలో 98.04 శాతం తిరిగి బ్యాంకులకు వచ్చాయని, కేవలం రూ.6,970 కోట్ల నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని తెలిపింది. మే 19, 2023న రూ.2000 బ్యాంకు నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. మే 19, 2023న బ్యాంకింగ్ వేళలు ముగిసే సమయానికి మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు చెలామణిలో ఉన్నాయని ఆర్బీఐ తెలిపింది. అక్టోబర్ 31, 2024న ట్రేడిరగ్ ముగిసే సమయానికి చెలామణిలో ఉన్న నోట్ల విలువ రూ.6,970 కోట్లుగా ఉంది. మే 19, 2023 వరకు చలామణిలో ఉన్న రూ. 2000 నోట్లలో 98.04 శాతం తిరిగి వచ్చినట్లు ప్రకటనలో పేర్కొంది. ఈ నోట్లను డిపాజిట్ చేసే లేదా మార్చుకునే సదుపాయం అక్టోబర్ 7, 2023 వరకు అన్ని బ్యాంక్ శాఖలలో అందుబాటులో ఉంది. ఈ సదుపాయం ఇప్పటికీ రిజర్వ్ బ్యాంక్ 19 ఇష్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంది. సెంట్రల్ బ్యాంక్ రూ. 2000 బ్యాంకు నోట్లను చెలామణి నుండి తీసివేసినప్పుడు 7 అక్టోబర్ 2023 వరకు ప్రజలకు సమీపంలోని ఏదైనా బ్యాంకు శాఖలో డిపాజిట్ చేసుకునే వెసులుబాటును కల్పించింది. దీని తరువాత ప్రజలు 19 ప్రాంతీయ కార్యాలయాలు, ఆర్బీఐ పోస్ట్‌ల ద్వారా నోట్లను మార్చుకునే సదుపాయాన్ని కల్పించారు. గత ఏడాది

మే 19 నుండి రిజర్వ్ బ్యాంక్ 19 ప్రాంతీయ కార్యాలయాలలో కూడా రద్దు చేసిన రూ.2,000 బ్యాంక్ నోటును మార్చుకునే సదుపాయం అందుబాటులో ఉంది. అయినప్పటికీ అక్టోబర్ 9, 2023 తర్వాత ఈ కార్యాలయాల్లో నోట్ల మార్పిడికి రద్దీ పెరిగింది. అప్పటి నుంచి ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు రూ.2000 నోట్లను కూడా స్వీకరిస్తున్నారు.

గ్లోబల్ మార్కెట్లోకి పోసిడెక్స్ టెక్నాలజీస్

భారత్‌లో కస్టమర్ మాస్టర్ డేటా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్‌ను అందించే ప్రముఖ ప్రొవైడర్ పోసిడెక్స్ టెక్నాలజీస్ ఇక గ్లోబల్ మార్కెట్‌లోకి విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం వ్యూహాత్మక రీబ్రాండిరగ్, ప్రణాళికలు చేపడుతున్నట్లు వెల్లడిరచింది. సోమవారం హైదరాబాద్‌లో పోసిడెక్స్ టెక్నాలజీ నూతన లోగోను పివి సింధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోసిడెక్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకులు, సిఇఒ కె వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సంక్లిష్టమైన డేటా సవాళ్లను, డిమాండ్ లను నిర్వహించడంలో తమ అపారమైన అనుభవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్లోబల్ మార్కెట్లోకి ప్రవేశించడంపై తాము గర్వపడుతున్నామన్నారు. అంతర్జాతీయ సంస్థలకు తమ డేటా సెక్యూర్డ్, క్లౌడ్ ఉత్పత్తులను అందించనున్నామన్నారు. ప్రస్తుతం పోసిడెక్స్ దేశంలోని ఏడు బ్యాంక్‌లకు, తొమ్మిది ప్రముఖ ఎన్‌బిఎఫ్‌సిలకు సేవలందిస్తుందన్నారు. ఈ విజయం ఆధారంగా అమెరికా, దుబారు, సింగపూర్, థాయిలాండ్, ఫిలిప్పీన్స్‌లో క్రియాశీల మార్కెట్లపైన దృష్టి సారిస్తున్నామన్నారు. తమ నూతన బ్రాండ్ దృశ్యపరమైన మార్పు మాత్రమే కాదని.. తమ ఆవిష్కరణలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనేది లక్ష్యమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దత్తా గౌరవెల్లి పేర్కొన్నారు.

అక్టోబర్‌లో పుంజుకున్న తయారీ రంగం

తయారీ రంగం కిందటి నెలలో పుంజుకుంది. అంతకు ముందు నెలలో ఎనిమిది నెలల కనిష్టానికి పడిపోయిన తయారీ రంగ పనితీరు, అక్టోబర్‌లో కోలుకుంది. మాన్యుఫాక్చరింగ్ సెక్టార్ పనితీరును కొలిచే హెచ్ఎస్‌బీసీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఈ ఏడాది సెప్టెంబర్‌లో 56.5 గా రికార్డ్ కాగా, అక్టోబర్‌లో 57.5 కి పెరిగింది. పరిస్థితులు మెరుగయ్యాయనే విషయం అర్థమవుతోందని ఎనలిస్టులు చెబుతున్నారు. పీఎంఐ 50 కి పైన నమోదైతే సంబంధిత సెక్టార్ విస్తరిస్తున్నట్టు. కొత్త ఆర్డర్లు పెరిగాయని, కంపెనీల గ్లోబల్ సేల్స్ ఊపందుకున్నాయని హెచ్ఎస్‌బీసీ ఎకనామిస్ట్ ప్రంజుల్ భండారి అన్నారు. ఇండియాలో తయారైన ప్రొడక్ట్‌లకు డిమాండ్ పెరుగుతోందని, కొత్త మార్కెట్లలోకి ఎంట్రీ ఇవ్వడంతో సేల్స్ పెరిగాయని చెప్పారు. కొత్త ఎక్స్‌పోర్ట్ ఆర్డర్స్ వస్తున్నాయని అన్నారు. రా మెటీరియల్స్ ధరలు పెరగడంతో కిందటి నెలలో తయారీ కంపెనీలు ఇన్‌ఫ్లేషన్ సమస్యను ఎదుర్కొన్నాయి.

అమరరాజా లాభం రూ.236 కోట్లు

అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్, సెప్టెంబరు త్రైమాసికానికి ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.3,276.20 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.235.61 కోట్ల పన్ను తర్వాత లాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.2,989.13 కోట్లు, పన్ను తర్వాత లాభం రూ.238.40 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ప్రస్తుత ఆదాయాలు కొంత మెరుగ్గా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి ఈ సంస్థ, రూ.6,568.84 కోట్ల మొత్తం ఆదాయాన్ని, రూ.484.73 కోట్ల పన్ను తర్వాత లాభాన్ని నమోదు చేసింది. ప్రథమార్ధానికి రూ.26.48 ఈపీఎస్ ఉంది. 2023-24 ఇదేకాలంలో ఆదాయం రూ.5,808.96 కోట్లు, పన్ను తర్వాత లాభం రూ.436.71 కోట్లు, ఈపీఎస్ రూ.23.86 గా ఉన్నాయి.మధ్యంతర డివిడెండ్: వాటాదార్లకు రూ.1 ముఖ విలువ కల ఒక్కో షేరుకు రూ.5.30 చొప్పున (530%) మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని అమరరాజా డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది. దీనికి ఈ నెల 14వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించారు. రూ.2,000 కోట్ల పెట్టుబడి: తన సబ్సిడరీ కంపెనీ అయిన అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఏసీటీ) లో రూ.2,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలనే ప్రతిపాదనను అమరరాజా డైరెక్టర్ల బోర్డు ఆమోదించింది. ఒకేసారి కానీ, రెండు మూడు దఫాలుగా గానీ ఈ పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. ఇంతకు ముందు గరిష్ఠంగా రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు అనుమతి తీసుకున్నారు. దీన్ని ఇప్పుడు రెట్టింపు చేశారు.

భారత్‌లో రికార్డ్ సెల్లింగ్ స్మార్ట్‌ఫోన్‌లు..

స్మార్ట్‌ఫోన్ అనేది నేడు దాదాపు ప్రతి ఒక్కరూ ఉపయోగిస్తున్నారు. సరికొత్త ఫీచర్లతో వచ్చే కొత్త ఫోన్‌లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. ఈ సంవత్సరం మూడవ త్రైమాసికంలో (జూలై నుండి సెప్టెంబర్ 2024), భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ విక్రయాలు ఉంటాయి 3 వార్షిక వృద్ధి ఉంది. అలాగే, వాటి ధరల వార్షికంగా 12 శాతం పెరిగింది. ఏ త్రైమాసికంలోనూ ఇదే అత్యధికం. ఈ త్రైమాసికంలో 5%+% ఫోన్‌లు ఆధిపత్యం చెలాయించాయి. వాటి అమ్మకాలు కూడా అత్యధికంగా ఉన్నాయి.కౌంటర్ పాయింట్ నివేదిక ప్రకారం.. ప్రజలు ఇప్పుడు ఖరీదైన ఫోన్‌లను కొనుగోలు చేయడం వల్ల స్మార్ట్‌ఫోన్ ధరలు పెరుగుతున్నాయి. అదే సమయంలో ఈ సంవత్సరం పండుగ సీజన్‌లో ప్రజలు చాలా ఫోన్‌లను కొనుగోలు చేయడం అమ్మకాలను పెంచడానికి దారితీసింది. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌పై శాంసంగ్‌కు గట్టి పట్టు ఉంది. 2024 మూడో త్రైమాసికంలో అత్యధిక ఫోన్‌లను విక్రయించిన బ్రాండ్ ఇదే. దీని మార్కెట్ వాటా 22.8 శాతంగా ఉంది. కౌంటర్‌పాయింట్‌లో సీనియర్ విశ్లేషకుడు ప్రాచీర్ సింగ్ మాట్లాడుతూ..శామ్‌సంగ్ మార్కెట్ వాటా 23 అత్యధికం. కంపెనీ తన ఫ్లాగ్‌షిప్ రీ సిరీస్‌పై దృష్టి సారించింది. ప్రధానంగా తక్కువ ధరల్లోనే మంచి ఫోన్ తీసుకురావడం దీని లక్ష్యం. గెలాక్సీ ఏ-సిరీస్ ఫోన్లు కూడా ఏఐ ఫీచర్లను అందజేస్తున్నాయని, దీంతో ప్రజలు ఫోన్లను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారని ఆయన చెప్పారు. 2024 మూడవ త్రైమాసికంలో ఆపిల్ రెండవ అతిపెద్ద ఫోన్ విక్రయ బ్రాండ్. దీని మార్కెట్ వాటా 22 శాతం. ఆపిల్ చిన్న పట్టణాలపై కూడా ఎక్కువ దృష్టి సారిస్తోంది. ఇది కొత్త ఐఫోన్‌ల అమ్మకాలను పెంచుతోంది. పండుగ సీజన్‌కు ముందు ఐఫోన్ 15, ఐఫోన్ 16 బలమైన అమ్మకాల నుండి ఆపిల్ లాభపడిరది. నివేదిక ప్రకారం, ప్రజలు ఇప్పుడు ఖరీదైన ఫోన్‌లను కొనుగోలు చేస్తున్నారు. భారతదేశంలో ఖరీదైన ఫోన్ కొనుగోలుదారులకు ఆపిల్ మొదటి ఎంపిక. దీనికి కారణం యాపిల్ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది.

సిరీస్‌ను కైవసం చేసుకుంటేనే

భారత్ ఫైనల్ కు చేరుకుంటుంది

న్యూజిలాండ్ చేతిలో వరుసగా మూడు టెస్టు మ్యాచ్ ల్లో పరాజయాల కారణంగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కు చేరుకోవాలన్న భారత క్రికెట్ జట్టు ఆశలు దెబ్బ తిన్నాయి. ఇప్పుడు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాపై తప్పక గెలవాల్సిన అవసరం ఉంది. 4-0తో సిరీస్‌ను కైవసం చేసు కుంటేనే భారత్ ఫైనల్ కు చేరుకుంటుంది. ఒకవేళ బోర్డర్ గావస్కర్ సిరీస్ లో ఓడితే మాత్రం మిగతా జట్ల ఫలితాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్ గావస్కర్ టెస్టు సిరీస్ లో భారత జట్టు ఓడిపోయినా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలకు తెరపడదు. ఆస్ట్రేలియా చేతిలో భారత్ 2-3తో టెస్టు సిరీస్‌ను కోల్పోయినా %ఔజ% 2023-25లో ఫైనల్‌కు చేరుకోవచ్చు. కివీస్ చేతిలో ఓటమి తర్వాత భారత్ విజయాల శాతం 53.51గా ఉంది. ఇది ప్రస్తుత ఛాంపియన్ ఆస్ట్రేలియా తర్వాత రెండవ స్థానంలో ఉంది. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టీమిండియా 4-0తో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధార పడకుండా నేరుగా ఫైనల్లోకి ప్రవేశిస్తుంది. లేదంటే మాత్రం న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్ల ఫలితాలపై ఆధార పడాల్సి ఉంటుంది. వచ్చే నెలలో ఇంగ్లండ్ జట్టు న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి ఇంగ్లండ్ ఇప్పటికే నిష్క్రమించింది. ఇంగ్లండ్ జట్టు 3-0తో న్యూజిలాండ్‌ను ఓడించినట్లయితే, ఆతిథ్య జట్టు విజయ శాతం గణనీయంగా తగ్గుతుంది. సిరీస్ 1-1తో సమం అయితే భారత్‌కు లాభిస్తుంది. సిరీస్ తర్వాత, న్యూజిలాండ్ విజయాల శాతం 52.38గా ఉంటుంది. న్యూజిలాండ్-ఇంగ్లండ్‌ల మధ్య మూడు టెస్టుల సిరీస్‌తో పాటు, దక్షిణాఫ్రికా -శ్రీలంక మధ్య జరిగే రెండు టెస్టుల సిరీస్‌పై కూడా భారత్ ఆధారపడాల్సి ఉంటుంది.

వారియర్స్‌ను 125-112 తేడాతో

ఓడించిన స్టీఫెన్ కర్రీ

నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్, లేదా చీదీ, ప్రపంచంలోని అత్యుత్తమ బాస్కెట్‌బాల్ క్రీడాకారులను కలిగి ఉన్న ఉత్తర అమెరికా అంతటా 30 జట్లతో కూడిన ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ లీగ్. 79వ సీజన్ గా 2024-25 కొనసాగుతోంది. అక్టోబర్ 22, 2024న ప్రారంభమైన మ్యాచ్ లు ఏప్రిల్ 13, 2025న ముగుస్తాయి. సోమవారం జరిగిన మ్యాచ్ ను పరిశీలిస్తే.. గాయం నుంచి కోలుకున్న స్టీఫెన్ కర్రీ సెకండ్ ఆఫ్ లో 24 పాయింట్లలో 18 పాయింట్లు సాధించగా, గోల్డెన్ స్టేట్ వారియర్స్ సోమవారం రాత్రి వాషింగ్టన్ విజార్డ్స్ పై 125-112 తేడాతో విజయం సాధించింది. గోల్డెన్ స్టేట్ విజయ పరంపర మొదటి మూడు మ్యాచ్ లు కర్రీ లేకుండా కొనసాగాయి. కానీ అతను కేవలం 24:05 మాత్రమే గేమ్ లో ఉన్నప్పటికీ విజార్డ్స్ తో ప్రారంభించగలిగాడు. 3-0తో స్కోరును ప్రారంభించిన కర్రీ ఆ తర్వాత మళ్లీ గోల్ చేయకపోవడంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి వారియర్స్ 54-45తో ఆధిక్యంలో నిలిచింది. గోల్డెన్ స్టేట్ బెంచ్ నుంచి మరో బలమైన సహకారంలో భాగంగా బడ్డీ షీల్డ్ 20 పాయింట్లు సాధించాడు. వారియర్స్ రిజర్వ్ 60-33తో వాషింగ్టన్ ను ఓడిరచింది. ఈ సీజన్ లో ఇప్పటి వరకు బెంచ్ పాయింట్లలో గోల్డెన్ స్టేట్ సగటున 24 పాయింట్లు సాధించింది. జోర్డాన్ పూలే 24 పాయింట్లతో వాషింగ్టన్ కు నాయకత్వం వహించాడు, కైల్ కుజ్మా (కుడి గజ్జ ఒత్తిడి) విజార్డ్స్ తరఫున వరుసగా మూడో మ్యాచ్ కు దూరమయ్యాడు, మార్విన్ బాగ్లే కూడా అనారోగ్యం కారణంగా దూరమయ్యాడు. వాషింగ్టన్ కమాండర్స్ ఫుట్ బాల్ ప్లేయర్ జేడెన్ డేనియల్స్ ఈ మ్యాచ్ కు హాజరై ప్రేక్షకుల నుంచి భారీ ప్రశంసలు అందుకున్నారు. వారియర్స్: గోల్డెన్ స్టేట్ 13 మంది ఆటగాళ్లలో 12 మంది 13:06 నుంచి 28:53 మధ్య మ్యాచ్ లోఉన్నారు.

తొలి వన్డేలో ఆసీస్ గెలుపు

పాకిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలో ఆతిత్య ఆస్ట్రేలియా జట్టు రెండు వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 46.4ఓవర్లలో 203పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా జట్టు 33.3ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి ఛేదించింది. పాకిస్తాన్ జట్టులో కెప్టెన్ రిజ్వాన్(44), బాబర్(37), నసీమ్ షా(40) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లు స్టార్క్‌కు మూడు, కమిన్స్, జంపాకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా ఓపెనర్లు షార్ట్(1), ఫ్రేజర్(16) నిరాశపరిచినా.. స్మిత్(44), ఇంగ్లిస్(49) బ్యాటింగ్‌లో రాణించారు. ఆసీస్ 155పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో కెప్టెన్ కమ్మిన్స్(32నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించి మ్యాచ్‌ను ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టార్క్‌కు లభించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యతలో ఉండగా.. రెండో వన్డే పుక్రవారం అడిలైడ్ వేదికగా జరగనుంది.

కమిన్స్‌ను రెచ్చగొట్టాడు.. తర్వాత బంతికే అవుట్ అయ్యాడు..

పాకిస్తాన్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ 44, నసీం షా 40 పరుగులతో టాప్ స్కోరర్ లు గా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ మూడు వికెట్లు సాధించాడు. కమిన్స్, జంపా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అబాట్, లభిషేన్ చెరో వికెట్ సాధించారు. ఆస్ట్రేలియా జట్టు టాస్ గెలవడంతో బౌలింగ్ ఎంచుకుంది. నీతో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టు ప్రారంభంలోనే ఓపెనర్లను కోల్పోయింది. అయూబ్(1), అబ్దుల్లా షఫీ కి (12) స్టార్క్ బౌలింగ్ లో అవుట్ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన రిజ్వాన్, బాబర్ ఆజాం (37) ఇన్నింగ్స్ భారాన్ని భుజాలకు ఎత్తుకున్నారు. అయితే జంపా వేసిన అద్భుతమైన బంతికి బాబర్ అవుట్ అయ్యాడు. అనంతరం క్రీజ్ లోకి వచ్చిన కమ్రాన్ గులాం ధాటిగా బ్యాటింగ్ చేయ డానికి తన వంతు ప్రయత్నం చేశాడు. కమిన్స్ ను దీటుగా ఎదుర్కొన్నాడు. ఇదే క్రమంలో కమిన్స్ ను గేలి చేశాడు. 19 ఓవర్ ను కమిన్స్ వేయగా.. ఐదవ బంతిని గులాం డిఫెన్స్ ఆడాడు. " కాస్త ఎదురు చూడు" అంటూ స్మిత్ లాగా కమిన్స్ కు బ్యాట్ చూపించాడు. గట్టిగా డ్కెలాగ్ చెప్పాడు. ఇది కమిన్స్ కు చిరాకు తెప్పించింది. కమ్రాన్ ఆస్ట్రేలియా తోనే వన్డేలోకి ఆరం గేట్రం చేశాడు. తొలి మ్యాచ్ లోనే అతి చేస్తున్న అతడికి బుద్ధి చెప్పాలని కమిన్స్ భావించాడు. దీంతో అతడు అత్యంత శక్తివంతమైన బౌన్సర్ వేశాడు. దానిని ఆడటంలో కమ్రాన్ విఫలమ. పైగా ఆ బంతి బ్యాట్ కు తగలడంతో వికెట్ కీపర్ జోస్ ఇంగ్లిస్ అద్భుతంగా ఒడిసి పట్టాడు. దీంతో కమ్రాన్ నిరాశతో మైదానాన్ని విడాడు. ఇటీవల ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన టెస్ట్ సిరీస్లో ఇంటర్నేషనల్ క్రికెట్ లోకి కమ్రాన్ ఎంట్రీ ఇచ్చాడు. బాబర్ ప్లేస్ లో నాలుగో స్థానంలో అతడు బ్యాటింగ్ చేశాడు. తొలి మ్యాచ్ లోనే సెంచరీ చేశాడు. రెండో మ్యాచ్లో కేవలం మూడు పరుగులు మాత్రమే చేశాడు. ఇక ఆస్ట్రేలియా పర్యటనకు కమ్రాన్ ఎంపికయ్యాడు. వన్డేలోనూ తుది జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. అయితే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతడు కమిన్స్ బౌన్సర్ కు అవుట్ కావడంతో.. అది ఆస్ట్రేలియా స్కోర్ పై ప్రభావం చూపించింది. కమ్రాన్ మాత్రమే కాకుండా మిగతా ఆటగాళ్లు కూడా ఆస్ట్రేలియా బౌలర్ల ఎదుట తలవంచారు. స్థిరమైన ఇన్నింగ్స్ ఆడడంలో విఫలమయ్యారు. దీంతో పాకిస్తాన్ భారీ స్కోర్ చేయలేకపోయింది. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఆడుతూ పాడుతూ చేదించింది.. 3 వన్డేల సిరీస్ లో తొలి విజయాన్ని నమోదు చేసింది.

ఆసీస్ సిరీస్‌తో ఎవరు ఉంటారో తేలిపోవడం ఖాయం

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ కోల్పోయిం ది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో వెనకబడి పోయింది. అప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న టీమ్ఇండియా సిరీస్ ఓటమితో రెండుకు పడిపోయింది. ఈనెల మూడో వారం నుంచి ఆసీస్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఇప్పటికే ఓటమి భారంతో ఉన్న భారత్‌కు మరో షాక్ ఇచ్చేందుకు ఆసీస్ అన్నివిధాలా సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్య లు చేశాడు. ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 4-0తో గెలవడం కష్టమేనని పేర్కొన్న సన్నీ.. తాజాగా సీనియర్ల భవితవ్యం పైనా స్పందించాడు. ఈ సిరీస్‌తో వారి భవిష్యత్తు తేలిపో తుందని వ్యాఖ్యానించాడు. "ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌ను గెలవడంపైనే దృష్టి సారించాలని గతంలోనే చెప్పా. అది ఎలా అనేది పక్కన పెట్టేయాలి. ఫస్ట్ సిరీస్ నెగ్గాలి. ఆ తర్వాతనే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌పై ఆలోచించాలని న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఓటమి అనంతరం భారత్‌కు సూచించా. మొన్నటివరకు అత్యంత బలంగా ఉందనిపిం చిన టీమ్ఇండియాకు ఇప్పుడు కఠిన సవాల్ ఎదురుకానుం ది. గత కొన్నేళ్లుగా అదరగొడుతూ వచ్చిన సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇటీవల తమ స్థాయి ప్రదర్శన చేయలే దు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాను ఓడిరచిన భారత్.. స్వదేశంలో కివీస్ చేతిలో పరాజయం చవిచూస్తుందని ఎవరూ ఊహించలేదు. ఈ సీనియర్లు కూడా భారీగా పరుగులు చేయడంలో విఫలమమయ్యారు. అందుకే, ఆసీస్‌తో టెస్టు సిరీస్ వీరి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. స్వదేశంలో స్పిన్నర్లనే ఎదుర్కోవడంలో తెగ ఇబ్బందిపడ్డారు. అలాంటిది ఆస్ట్రేలి యా గడ్డపై పేస్‌కు ఎదురొడ్డి నిలవాలంటే మాటలు కాదు. తమ సత్తాను నిరూపించుకొని కొనసాగుతారా? లేదా? అనేది చూడాలి" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

వరల్డ్ కప్ హీరోకు మొండి చెయ్యి

శస్త్ర చికిత్స అనంతరం షమీ కోలుకున్నాడు. సుదీర్ఘకాలం ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం అతడు ఇటీవల లండన్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చాడు.. ఆ తర్వాత జాతీయ జట్టులోకి ప్రవేశించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆస్ట్రేలియా జట్టుపై తిరుగులేని రికార్డు కలిగి ఉన్న షమీ.. త్వరలో జరిగే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో చోటు కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. ఇప్పటికే జట్టు ఎంపిక పూర్తయినప్పటికీ.. అందులో షమీకి చోటు లభించకపోయినప్పటికీ.. అతడు జాతీయ జట్టులోకి రావాలని తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఈ క్రమంలోనే రంజీ ట్రోఫీలో ఆడాలని భావిస్తున్నాడు.. వాస్తవానికి వన్డే వరల్డ్ కప్ టీమ్ ఇండియా సాధించకపోయినప్పటికీ.. భారత క్రికెట్ జట్టు తరఫున అద్భుతమైన ప్రదర్శన చూపించాడు. ముఖ్యంగా న్యూజిలాండ్ జట్టుతో జరిగిన మ్యాచ్లో సత్తా చాటాడు. కాలికి గాయం అయిన నేపథ్యంలో.. శస్త్ర చికిత్స చేయించుకున్న తర్వాత అతడు న్యూజిలాండ్ సిరీస్ ద్వారా జాతీయ జట్టులోకి వస్తాడని అందరూ భావించారు. దక్షిణాఫ్రికా సిరీస్ లోనూ అతడికి అవకాశం లభిస్తుందని అనుకున్నారు. కానీ అవేవీ జరగలేదు. శస్త్ర చికిత్స అనంతరం షమీ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో చేరాడు. అక్కడ రీహబిలిటేషన్ పూర్తి చేసుకున్నాడు. ఫిట్నెస్ టెస్ట్ కూడా పాస్ అయ్యాడు. అయితే దేశవాళి క్రికెట్లో తనను తాను నిరూపించుకోవడం కోసం రంజీ ఆడతానని ప్రకటించాడు.. అందులో పూర్తిస్థాయిలో సత్తా చాటి.. ఆ తర్వాత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడతానని ప్రకటించాడు. అయితే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో షమీకి అవకాశం లభించలేదు. అయితే అయినప్పటికీ జాతీయ జట్టులో స్థానం సంపాదించడమే అతని లక్ష్యం కాబట్టి.. బెంగాల్ తరఫున అతడు రంజి ఆడతాడని అందరూ అనుకున్నారు. అయితే తదుపరి రెండు రౌండ్ల మ్యాచ్ లకు సంబంధించి బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ సోమవారం జట్టును ప్రకటించింది. అందులో షమీకి అవకాశం లభించలేదు. కర్ణాటక జట్టుతో నవంబర్ 6 నుంచి బెంగాల్ జట్టు నాలుగో రౌండు రంజి మ్యాచ్ లో తలపడుతుంది. ఇక నవంబర్ 13 నుంచి మొదలయ్యే 5 రౌండ్లో మధ్యప్రదేశ్ జట్టుతో పోటీపడుతుంది. ఇక రంజీ ట్రోఫీకి సంబంధించి తొలి దశ టోర్నీకి ఇదే ఆఖరి రౌండ్ . రెండవ దశలో లీగ్ మ్యాచ్ లు నిర్వహిస్తారు. ఆ తర్వాత నాకౌట్ మ్యాచులు జరుపుతారు. రెండవ దశలో సాగే రంజీ ట్రోఫీకి ముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే టోర్నీలు నిర్వహించనున్నారు.

బాక్సాఫీస్‌ను రూల్ చేయబోతున్న విజయ్

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ అభిమానులు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న సినిమా దళపతి 69. హెచ్ వినోథ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. ప్రేమలు ఫేం మమితా బైజు కీలక పాత్ర పోషిస్తోంది. ఈ మూవీలో ప్రకాశ్ రాజ్, ప్రియమణి, నరేన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, బాబీడియోల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే దళపతి 69 కొత్త షెడ్యూల్ షురూ అవగా.. విజయ్‌తోపాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్నట్టు కోలీవుడ్ సర్కిల్ సమాచారం. కాగా ఇప్పుడొక ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతూ.. విజయ్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ చిత్రం ఓవర్సీస్ థ్రియాట్రికల్ రైట్స్ భారీ మొత్తానికి అమ్ముడుపోయాయన్న వార్త ఒకటి హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం రూ.78 కోట్లు పలికాయి. ఈ ధర ది గోల్, లియో చిత్రాల కంటే ఎక్కువ కావడం విశేషం. విజయ్ సినిమాకు క్రేజ్ ఎలా రేంజ్‌లో ఉందో ఈ ఒక్క వార్త చెప్పకనే చెబుతోంది. దళపతి-హెచ్ వినోథ్ కాంబో బాక్సాఫీస్‌ను రూల్ చేయడం పక్కా అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం 2025 దీపావళి కానుకంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. విజయ్ పొలిటికల్ ఎంట్రీ నేపథ్యంలో దళపతి 69 చివరి సినిమా కానుందని తెలిసిందే. మరి విజయ్ లాస్ట్ సినిమా ఎలాంటి జోనర్‌లో ఉండబోతుందో అంటూ.. ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.



నడుమందాలతో కవ్విస్తున్న మీనాక్షి చౌదరి

టాలీవుడ్ ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంటూ మంచి జోష్ మీదుంది ఈ హీరోయిన్. అతి తక్కువ సమయంలోనే తనకంటూ మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట తెగ వైరలవుతున్నాయి. ఇంతకీ వయ్యారి ఎవరో గుర్తుపట్టారా.. ? ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస హిట్స్ అందుకుంటూ ఫుల్ జోష్ మీదుంది ఈ హీరోయిన్. ఇన్నాళ్లు ఆడపాదడపా చిత్రాలతో అలరించిన ఈ ముద్దుగుమ్మకు ఇప్పుడు భారీ బడ్జెట్ చిత్రాల అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం చేతినిండా లతో క్షణం తీరిక లేకుండా గడిపేస్తుంది. ఇంతకీ ఆ వయ్యారి మరెవరో కాదు.. హీరోయిన్ మీనాక్షి చౌదరి. ఇచ్చట వాహనములు నిలుపరాదు తో తెలుగు తెరకు పరిచయమైన ఈ వయ్యారి.. ఆ తర్వాత చిన్న చిన్న ల్లో నటించింది. అడివి శేష్ సరసన హిట్ 2 చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న ఈ బ్యూటీకి.. ఆ వెంటనే మహేష్ బాబు సరసన గుంటూరు కారం మూవీలో ఛాన్స్ వచ్చింది. ఇక ఇప్పుడు లక్కీ భాస్కర్ తో మరో హిట్టు అందుకుంది మీనాక్షి. డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఈ ప్రస్తుతం థియేటర్లలో దూసుకుపోతుంది. దుల్కర్ భార్యగా నటించి ప్రశంసలు అందుకుంది మీనాక్షి. మరోవైపు వెంకీ కొత్త ప్రాజెక్టులోనూ నటిస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మట్కా తోపాటు తమిళంలోనూ నటిస్తుంది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోస్ నెటిజన్లను తెగ ఆకట్టుకుంటున్నాయి. నీలిరంగు మోడ్రన్ డ్రెస్సులో అందంగా ముస్తాబయ్యింది మీనాక్షి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలలో నడుమందాలతో కవ్విస్తోంది నెటిజన్లను కట్టిపడేస్తుంది మీనాక్షి. ప్రస్తుతం ఈ అమ్మడు టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ బిజీ హీరోయిన్.

రకుల్ ప్రీత్‌పై దారుణమైన ట్రోలింగ్

రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కన్నడ మూవీ 'గిల్లి'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో తొలిసారిగా 'కెరటం'లో నటించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో మంచి గుర్తింపును సాధించింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేశ్‌బాబు, మోగా హీరో రామ్‌చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల్లో అవకాశాలను దక్కించుకొని.. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం టాలీవుడ్‌కు దూరమైంది. చివరగా తెలుగులో కొండపొలం మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బిజీగా మారింది. ప్రస్తుతం పెళ్లి చేసుకొని సెటిల్ అయ్యింది. పెళ్లయిన బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ వస్తున్నది. అయితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో రకుల్ ప్రీత్ సింగ్‌పై ట్రోలింగ్ జరుగుతున్నది. దీపావళి పండుగ ఫైర్ క్రాకర్స్ గురించి చేసిన వ్యాఖ్యలను పలువురు సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలో ఓ ప్రశ్నకు రకుల్ బదులిస్తూ.. 'దీపావళికి అంతా ఫైర్‌కాకర్స్ కాలుస్తుంటారు. చిన్నప్పుడు దీపావళి పండుగ సమయంలో మా పాప రూ.500 నోట్ ఇచ్చాడు. ఇప్పుడు రూ.500 ఎందుకిస్తున్నారు? అని అడిగాను. ఈ డబ్బుతోనే కదా నువ్వు ఫైర్‌కాకర్స్ కొని కాలుస్తావు. దాంతో ఎంత కాలుష్యమో తెలుసా? అని ప్రశ్నించారు. అదే డబ్బును అవసరం ఉన్న వారికి పేదవారికి ఇవ్వొచ్చని.. లేకపోతే చాక్‌లెట్స్, ఇంకా ఏమైనా కొని ఇవ్వచ్చని చెప్పారు. ఆయన చెప్పింది నిజమేనని అనిపించిందని, ఆ సమయంలో 5వ తరగతి చదువుతున్నాను. అప్పటి ఇప్పటి వరకు మళ్లీ బాణాసంచా కాల్చలేదు' అంటూ రకుల్ వివరించింది.

గేమ్ చేంజర్‌కు డైరెక్టర్ శంకర్ భారీ ప్లాన్

గ్లోబల్ స్టార్ రాంచరణ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం గేమ్‌చేంజర్. స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు సుందరి అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీజర్ అప్‌డేట్ రానే వచ్చింది. తాజా టాక్ ప్రకారం నవంబర్ 9న గేమ్ ఛేంజర్ టీజర్ లాంచ్ చేయబోతున్నారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌ను లక్నోలో నిర్వహించనున్నట్టు టాలీవుడ్ సర్కిల్ టాక్. మొత్తానికి శంకర్ ఈ సారి రూటు మార్చి ఏకంగా నార్తిండియాలో ప్లాన్ చేసి భారీ స్కెచ్ వేశాడని అర్థమవుతోంది. ఈ మూవీని 2025 జనవరి 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తున్నాడు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్న ఈ సినిమాకు ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

సమంతకు అభిమానుల ప్రపోజ్

సమంత ప్రస్తుతం హిందీ వెబ్ సిరీస్ సిటాడెల్ ప్రమోషన్స్ లో ఫుల్ బిజీగా ఉంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలోనూ తన సిరీస్ ను ప్రమోట్ చేసుకుంటుంది ఈ బ్యూటీ. అందాల భామ సమంత లకు ఏడాది పాటు బ్రేక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆమె ఎప్పుడెప్పుడు తిరిగి లు చేస్తుందా అని అభిమానులంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సామ్ హిందీలో ఓ వెబ్ సిరీస్ లో నటిస్తుంది. ఈ సిరీస్ త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. అలాగే తెలుగులోనూ ఓ కు కమిట్ అయ్యింది ఈ వయ్యారి భామ. ఇక సమంత ప్రస్తుతం హిందీ వెబ్ సిరీస్ సిటాడెల్ ప్రమోషన్స్ లో ఫుల్ బిజీగా ఉంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలోనూ తన సిరీస్ ను ప్రమోట్ చేసుకుంటుంది ఈ బ్యూటీ. ఈ క్రమంలోనే నెటిజన్స్ తో ముచ్చటించింది. సోషల్ మీడియాలో అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాదానాలు చెప్పింది సామ్. ఇక అభిమానులు సమంతకు తెగ ప్రపోజ్ చేశారు. అలాగే కొద్దిగా వెయిట్ పెరగొచ్చు కదా? అంటూ ఓ నెటిజన్ అన్నాడు. దానికి కౌంటర్ ఇచ్చింది. బరువు గురించి ఎందుకు.? నేను ఇప్పుడు ఉన్న కండీషన్, మెయింటైన్ చేసే డైట్‌కి ఇలానే ఉంటాను.. నేను బరువు పెరగను. మీది మీరు చూసుకోండి. ఎదుటివారిని జడ్జ్ చేయకండి అని సీరియస్ అయ్యింది సమంత. అలాగే తన పాత్రల గురించి మాట్లాడుతూ.. నేను ఎప్పుడు మంచి పాత్రలే ఎందుకోవడానికి ట్రై చేస్తా.. గతంలో తన రోల్స్ విషయంలో కొన్ని తప్పులు చేశానని, వాటిని ఒప్పుకుంటున్నా.. ఇప్పుడు జాగ్రత్తపడుతున్నా అని చెప్పుకొచ్చింది.

ఎనిమిదేళ్ల బాలుడి చేతిలో మోసపోయా

కోలీవుడ్‌లో యువనటి నివేదా పేతురాజ్

తాను ఎనిమిదేళ్ళ బాలుడి చేతిలో మోసపోయానని హీరోయిన్ నివేదా పేతురాజ్ వాపోయారు. తన చేతిలో ఉన్న కరెన్సీని బలవంతంగా లాక్కొని పారిపోయాడన్నారు. కోలీవుడ్‌లో యువనటి నివేదా పేతురాజ్ 'ఒరునాల్ కూత్తు', 'పాదువాగ ఎన్‌మనసు', 'టిక్ టిక్ టిక్' వంటి అనేక చిత్రాల్లో నటించిన ఆమె... ఇపుడు చెన్నై నగరంలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అడయార్ ప్రాంతంలో ఒక బాలుడు చేతిలో మోసపోయినట్టు ఆమె వెల్లడించారు. విషయంలోకి వస్తే.. 'అడయార్ సిగ్నెల్ వద్ద ఎనిమిదేళ్ళ బాలుడు డబ్బులు అడిగాడు. ఉచితంగా డబ్బులు ఇచ్చేందుకు నా మనసు అంగీకరించలేదు. దీంతో రూ. 50 విలువైన పుస్తకాన్ని కొనాలని చెప్పడంతో రూ. 100 నోటు తీయగా, ఆ బాలుడు రూ. 500 అడిగాడు. దీంతో పుస్తకాన్ని బాలుడికి తిరిగి ఇచ్చి, నేను ఇచ్చిన రూ.100 నోటు వెనక్కి తీసుకున్నాను. అయితే, ఆ పిల్లవాడు పుస్తకాన్ని కారులో పడేసి... చేతిలోని రూ.వంద నోటు లాక్కొని పారిపోయాడు' అని పేర్కొంది. ఇది చాలా సిగ్నల్స్ వద్ద జరుగుతున్న విషయమే. సోషల్ మీడియాలో కూడా ఇలాంటి ఘటనకు సంబంధించిన వీడియోనే ఒకటి వైరల్ అవుతుంటుంది. వాటర్ బాటిల్స్ అమ్మే అతను.. ఒక కారు దగ్గర నిలబడి మూత తీయడానికి ప్రయత్నించగా.. ఆ మూత రాకపోవడంతో, కారులోని యువతి ఆ బాటిల్ తీసుకుని మూత తీసి సదరు వ్యక్తికి ఇవ్వబోగా.. రూ. 20 ఇవ్వాలని అతను చెప్పడంతో చేసేది లేక ఆమె రూ. 20 చెల్లించుకుంటుంది. ఇలాంటి మోసాలు ప్రతి రోజూ చాలా అంటే చాలానే జరుగుతూ ఉంటాయి. ఇప్పుడు నివేదా పేతురాజ్ కూడా అలాంటి మోసానికే గురయింది. నివేదా పేతురాజ్ విషయానికి వస్తే.. తెలుగు ప్రేక్షకులకూ ఆమె సుపరిచితమే. 'అల వైకుంఠపురములో' చిత్రంలో సుశాంత్‌కి లవర్‌గా ఆమె నటించింది. 'మెంటల్ మదిలో, చిత్రలహరి, పాగల్, దాస్ కా ధమ్కీ' వంటి చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఆమె వెబ్ సిరీస్‌లతో బిజీ నటిగా గడుపుతోంది.